


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 211 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 6 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :211 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 6 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

- నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో 100 రోజుల కార్యాచరణ
- ఏప్రిల్ 6 నుంచి జులై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం
- 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు
- అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం
- ప్రజల భాగస్వామ్యంతో కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు రేపు (ఏప్రిల్ 6) తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**100 రోజుల కార్యాచరణ.. సాగునీటి సంఘాలకు కీలక బాధ్యతలు**

నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును

- మిగతా2లో



## జగన్ దీనికేమని సమాధానం చెబుతారు?

- అమరావతి నిర్మాణ ఖర్చుపై సీఎం జగన్ అబద్ధాలు చెబుతున్నారని కన్నా ఆరోపణ
- రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి చ.అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని విమర్శ
- అమరావతి నిర్మాణానికి అయ్యేది చ.అడుగుకు రూ.6,985 మాత్రమేనని వెల్లడి
- సొంత విలాసాల కోసం జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- తెలంగాణ సచివాలయం, పార్లమెంటు భవనాలతో నిర్మాణ వ్యయాన్ని పోల్చిన కన్నా

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ పై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని నిర్మాణ వ్యయంపై జగన్ ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్

- మిగతా2లో



## జగన్ పేరు కూడా అలాంటిదే

- జగన్ పేరు శుభకార్యాల్లో పలకని అపశకునంలా మారిందని మంత్రి ఎద్దేవా
- అమరావతిని దెబ్బతీసి జగన్ చారిత్రక తప్పిదం చేశారని తీవ్ర విమర్శ
- అమరావతి అనేది లక్షల కోట్ల రాబడినిచ్చే సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ అని వెల్లడి
- కూటమి పాలనలో రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టీకరణ
- అబద్ధాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం మానుకోవాలని జగన్‌కు హితవు

- మిగతా2లో

## ఇది జగన్ కొత్త ఆలోచన కాదు.. 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు

- విజయవాడ-గుంటూరు-మచిలీపట్నం గ్రోత్ కారిడార్ జగన్ కొత్త ఆలోచన కాదన్న పట్టాభి
- చంద్రబాబు 2015లోనే 8,350 చ.కి.మీ.లతో సీఆర్డీఏను ఏర్పాటు చేశారని వెల్లడి
- సీఆర్డీఏను రద్దు చేయాలని చూసిన జగన్ ఇప్పుడు ప్రేమ చూపడం విడ్డూరమన్న టీడీపీ
- బిల్లుకు, తీర్మానానికి తేడా తెలియకుండా వైసీపీ గందరగోళం సృష్టిస్తోందని ఆరోపణ
- పార్లమెంటు చేసిన చట్టాన్ని రాష్ట్రం మార్చలేదని, అమరావతి ఆగదని స్పష్టీకరణ

- మిగతా2లో



## సన్‌రైజ్ హాస్పిటల్స్ ఎండీ కుమారుడి పెళ్లి రిసెప్షన్ కు లోకేశ్ హాజరు...

- వివాహ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి నారా లోకేశ్
- విజయవాడ సన్‌రైజ్ హాస్పిటల్స్ ఎండీ తనయుడి వివాహం
- మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన వేడుక
- నూతన వధూవరులు సాయి శిశిర్, వైష్ణవిలకు ఆశీస్సులు

- మిగతా2లో





## బాసరకు మహర్దశ...

### రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయ పునరుద్ధరణ

- సోమవారం భూమిపూజ చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- శృంగేరి పీఠాధిపతుల ఆమోదంతో సిద్ధమైన మాస్టర్ ప్లాన్
- ప్రస్తుత విస్తీర్ణం కన్నా మూడు రెట్లు పెరగనున్న ఆలయ ప్రాంగణం
- వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:దక్షిణ భారతదేశంలో ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయంగా ప్రసిద్ధి చెందిన బాసర క్షేత్రం కొత్త శోభను సంతరించుకోనుంది. వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పుణ్యక్షేత్రం పునఃనిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.225 కోట్లు కేటాయించింది. ఈ బృహత్తర ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నాడు భూమి పూజ చేసి పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శకత్వంలో, ఆగమశాస్త్ర నియమాలకు అనుగుణంగా ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.

**శృంగేరి పీఠం మార్గదర్శకత్వంలో పనులు**


వేదవ్యాస మహర్షి స్వయంగా ఇసుకతో సరస్వతి, లక్ష్మి, కాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్ఠించారని స్థలపురాణం చెబుతోంది. ఇంతటి

- మిగతా2లో

## హర్మూజ్ జలసంధి తెరవకపోతే

### పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే రెండూ ఒకేసారి చూస్తారు

### ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



- హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- తీవ్ర పరిణామాలు తప్పవంటూ సోషల్ మీడియాలో పోస్ట్
- మరో శాశ్వత యుద్ధంలోకి వెళుతున్నామని గవర్నర్ వెస్ మూర్ ఆందోళన
- ఈ యుద్ధానికి నైతిక సమర్థన లేదన్న ఆర్చ్‌బిషప్ తిమోతి బ్రోగ్లియో
- ట్రంప్ వైఖరిపై అమెరికాలో పెరుగుతున్న వ్యతిరేక స్వరాలు

- మిగతా2లో

## కడప జిల్లాలో కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు...

### తప్పిన పెను ప్రమాదం

- కడప జిల్లాలో ఆర్టీసీ బస్సుకు అగ్ని ప్రమాదం
- విద్యుత్ తీగలు తగలడంతో చెలరేగిన మంటలు
- డ్రైవర్ వేగంగా స్పందించడంతో సురక్షితంగా బయటపడ్డ 21 మంది
- ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బస్సు
- పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు

- మిగతా2లో



## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం... ఓ విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చేశాం



- తమ గడ్డపై అమెరికా రెస్క్యూ ఆపరేషన్‌ను విఫలం చేశామన్న ఇరాన్
- ఒక రవాణా విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చివేసినట్లు ప్రకటన
- ఈ ఆపరేషన్‌లో ఐదుగురు మరణించినట్లు వెల్లడించిన ఇరాన్ మీడియా
- తప్పిపోయిన పైలట్‌ను విజయవంతంగా రక్షించామన్న అమెరికా

పెన్ పవర్ డెస్క్:తమ భూభాగంలో అమెరికా చేపట్టిన ఓ రెస్క్యూ ఆపరేషన్‌ను విఫలం చేశామని ఇరాన్ ప్రకటించింది. ఈ ఆపరేషన్ సందర్భంగా ఒక సీ-130 రవాణా విమానంతో

- మిగతా2లో

## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

### అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

- భద్రాచలం సమీపంలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపాలని వినతి
- పాలనా సౌలభ్యం, గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఈ నిర్ణయం అవసరం
- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టాలని అభ్యర్థన

- మిగతా2లో



## ఈసారి సరిహద్దుల్లో కాదు.. నేరుగా కోల్‌కతాపైనే అటాక్ చేస్తం

పెన్ పవర్ డెస్క్:ఇస్లామాబాద్: ఇండియాపై నిత్యం విషం చిమ్మే పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత్ తమపై ఏదైనా దాడి చేస్తే

- మిగతా2లో






## ఇది జగన్ కొత్త ఆలోచన కాదు..
# 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు

విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ప్రాంతాలను కలుపుతూ 'మావిగన్' పేరిట గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా స్పందించారు. జగన్ ఇప్పుడు చెబుతున్నది కొత్త ఆలోచన కాదని, 11 సంవత్సరాల క్రితమే నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమకు ఎవరూ అభివృద్ధి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఏ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసని పట్టాభి వ్యాఖ్యానించారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్ లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

**11 ఏళ్ల క్రితమే చంద్రబాబు విజన్**

2014లో రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రచించారని పట్టాభి గుర్తుచేశారు. ఇందులో భాగంగానే 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించి, క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ)ను ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు 8,350 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సీఆర్డీఏను ఏర్పాటు చేసినట్లు వివరించారు.
మచిలీపట్నం సమీపంలోని మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల నుంచి గుంటూరు దాటి ఎడ్లపాడు వరకు సీఆర్డీఏ పరిధి విస్తరించి ఉందని, ఈ మ్యాప్ చూస్తే చంద్రబాబు దార్శనికత ఏమిటో అర్థమవుతుందని అన్నారు. "ఇప్పుడు జగన్ గారు చెబుతున్న గ్రోత్ కారిడార్ ఆలోచన 2015 సెప్టెంబర్ 22న జారీ చేసిన జీవో నంబర్ 207లోనే ఉంది. మచిలీపట్నం నుంచి ఎడ్లపాడు వరకు ఉన్న ప్రాంతమంతా అభివృద్ధి చేయాలనేది చంద్రబాబు నాటి ప్రణాళిక" అని పట్టాభి పేర్కొన్నారు.

**సీఆర్డీఏను రద్దు చేయాలని చూసింది మీరు కాదా?**

ఈ ప్రాంతంపై ఇప్పుడు కొత్తగా ప్రేమ చూపిస్తున్న జగన్మోహన్ రెడ్డి, 2020లో ఇదే సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసేందుకు ఎందుకు ప్రయత్నించారని పట్టాభి ప్రశ్నించారు. మూడు రాజధానుల పేరుతో ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవాలని చూసింది నిజం కాదా అని నిలదీశారు. "ఒకవైపు హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ, ఔటర్ రింగ్ రోడ్డుతో చంద్రబాబు ఎలా అభివృద్ధి చేశారో అందరికీ తెలుసు. అదే తరహా విజన్‌తో ఏపీలో సీఆర్డీఏను ఏర్పాటు చేస్తే, దాన్ని నాశనం చేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఇప్పుడు ఓటమి తర్వాత మళ్లీ ఈ ప్రాంతంపై ప్రేమ నటిస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

**బిల్లు వేరు.. తీర్మానం వేరు**

అమరావతి రాజధానిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కౌన్సిల్‌కు ఎందుకు పంపలేదని వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పట్టాభి ఆరోపించారు. బిల్లుకు, తీర్మానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. "బిల్లు అనేది చట్టరూపం దాల్చాలంటే ఉభయ సభల ఆమోదం తప్పనిసరి. కానీ, తీర్మానం (రెజల్యూషన్) అనేది కేవలం ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచడం కోసం చేసేది. కేంద్ర ప్రభుత్వం ఏపీ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి పంపమని కోరింది. అందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ఆ తర్వాత కేంద్రం పార్లమెంటులో బిల్లు పెట్టి ఉభయ సభల్లో ఆమోదింపజేసింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానుల అంశం 'బిల్లు' కాబట్టే కౌన్సిల్‌కు వెళ్లింది. కానీ ఇది కేవలం 'తీర్మానం' మాత్రమే," అని ఆయన స్పష్టం చేశారు.

**పార్లమెంటు చట్టాన్ని రాష్ట్రం మార్చలేదు**

జగన్మోహన్ రెడ్డి ఎన్ని మాట్లాడినా అమరావతి అభివృద్ధిని ఆపడం ఎవరివల్లా కాదని పట్టాభి అన్నారు. పార్లమెంటులో ఆమోదం పొందిన చట్టాన్ని ఒక రాష్ట్ర అసెంబ్లీ మార్చలేదన్న కనీస అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి పనులు వేగంగా ముందుకు సాగుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే సీఎం సమీక్షలు నిర్వహించి పనులకు టార్గెట్లు నిర్దేశించారని, త్వరలోనే రాజధానిలో భవనాలు వేగంగా పైకి లేస్తాయని అన్నారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

కూటమి ప్రభుత్వం కేవలం అమరావతికే పరిమితం కాదని, ఉత్తరాంధ్ర, రాయలసీమతో సహా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని పట్టాభి తెలిపారు. ఉత్తరాంధ్రకు ఆర్సెలార్ మిట్టల్, అదానీ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రాయలసీమకు పరిశ్రమలు తీసుకురావడంతో పాటు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూడా చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. నారా లోకేష్ లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం... ఓ విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చేశాం

- మొదటి పేజి తరువాయి

పాటు రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను కూల్చివేసినట్లు ఇరాన్ రివొల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) సంచలన ప్రకటన చేసింది. అమెరికా చేపట్టిన ఈ చర్య పూర్తిగా విఫలమైందని ఇరాన్ సైనిక కమాండ్ పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో ఐదుగురు మరణించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది.అయితే, ఈ ఆపరేషన్ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైందని, తమ పైలట్‌ను విజయవంతంగా రక్షించుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. గత శుక్రవారం ఇరాన్ కూల్చివేసిన తమ ఎఫ్-15ఈ యుద్ధ విమానంలో తప్పిపోయిన రెండో పైలట్‌ను (కల్నల్ ర్యాంక్ అధికారి) సురక్షితంగా కాపాడినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క అమెరికా సైనికుడు కూడా గాయపడలేదని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు.శుక్రవారం నాడు మధ్య ఇరాన్‌లో అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానం కూలిపోయింది. అందులోని ఇద్దరు పైలట్లలో ఒకరిని వెంటనే రక్షించగా, రెండో పైలట్ కోసం అమెరికా ప్రత్యేక దళాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే అమెరికా విమానాలను కూల్చివేశామని ఇరాన్ చెబుతోంది. ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో శత్రు విమానాలు మంటల్లో కాలిపోతున్నాయని ఇరాన్ అధికార ప్రతినిధి తెలిపారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ డ్రోన్‌ను కూడా కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది.ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలతో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇదే సమయంలో మరో అమెరికా యుద్ధ విమానం ఏ-10ను కూడా కూల్చినట్లు వార్తలు వస్తుండటం గమనార్హం.

# ఈసారి సరిహద్దుల్లో కాదు.. నేరుగా కోల్‌కతాపైనే అటాక్ చేస్తం

- మొదటి పేజి తరువాయి

తమ ప్రతిస్పందన సరిహద్దుల వరకే పరిమితం కాదని.. ఇండియా లోపలికి చొచ్చుకెళ్లి మరీ అటాక్స్ చేస్తామని ప్రగల్భాలు పలికారు. ఇండియా ఏదైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే ఈసారి తమ టారట?గెట్ కోల్?కతా అవుతుందని మతిలేని మాట్లాడారు. భారతీయుల ఇళ్లలోకి చొరబడి చంపేస్తామని బలుపు కూతలు కూశాడు. ఆర్ఎస్ఎస్ క్యాంప్ లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని హెచ్చరించాడు.
భారత నిర్బంధలో ఉన్న పాకిస్థానీయులతో ఒక 'ఫాల్స్ ఫ్లాగ్' కుట్రకు ఇండియా ప్లాన్ చేస్తోందని నిరాధార ఆరోపణలు చేశాడు. సొంత దేశంలో వారే దాడి చేసుకుని ఆ నిందను ఉగ్రవాదంపై మోపుతారని ఆరోపించాడు. ఖవాజా వ్యాఖ్యలపై ఇండియన్స్ భగ్గుమంటున్నారు. ఇండియాపై దాడి తర్వాత ముందు మీ దేశ ప్రజలకు మూడు పూటలా కడుపు నిండా అన్నం పెట్టడంటూ చురకలంటిస్తున్నారు. మంత్రులకు సరిగ్గా జీతాలు ఇవ్వలేని వారు కూడా యుద్ధాలు చేస్తామంటూ బీరాలు పలుకుతున్నారని సెటైర్లు వేస్తున్నారు. భారత్ చేతిలో ఇప్పటికే ఎన్నోసార్లు చావు దెబ్బతిన్న పాకిస్తాన్?కు బుద్ధి రావడం లేదంటూ విమర్శిస్తున్నారు. ఖవాజా కామెంట్స్ కేవలం వారిలోని భయం, నిస్సహాయతను సూచిస్తోంది. ప్రస్తుతం ఆ దేశం పశ్చిమ సరిహద్దులో ఆఫ్ఘన్ తాలిబన్లతో యుద్ధం చేస్తోంది. దేశంలోనే బలూచిస్థాన్, పంజాబ్, పాక్ ఆక్రమిత కాశ్మీర్లో ప్రజల తిరుగుబాటు తీవ్రస్థాయిలో ఉంది. వీటిని అదుపు చేయలేక, ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కలేక.. ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇండియాను బూచిగా చూపిస్తోంది. ఏ దేశమైనా యుద్ధం చేయాలంటే గుండె ధైర్యంతో పాటు ఖజానాలో డబ్బు కూడా ఉండాలి. మరీ ప్రస్తుతం పాకిస్థాన్ సిట్యూవేషన్ చూస్తే కనీసం తన దేశంలోని మంత్రులకే జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉండి భారీ యుద్ధాన్ని ఎలా కొనసాగిస్తుందన్నదే అతిపెద్ద ప్రశ్న.

# నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

- మొదటి పేజి తరువాయి

సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్థక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నీటి భద్రతను సాధిస్తే మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

**పక్కా ప్రణాళికతో పనులు.. జులై 14 డెడ్‌లైన్**

ఈ 100 రోజుల కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రూపొందించారు.
ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 వరకు: చేపట్టాల్సిన పనుల గుర్తింపు.
ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 20 వరకు: గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతుల మంజూరు.
ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు: క్షేత్రస్థాయిలో పనుల అమలు.
జూలై 10 నుంచి జూలై 14 వరకు: పూర్తి చేసిన పనులపై నివేదికల సమర్పణ.
ఈ షెడ్యూల్ ప్రకారం 'మిషన్ అప్రోచ్'తో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సీఎం అధికారులకు, సాగునీటి సంఘాల సభ్యులకు సూచించారు.

**అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం**

నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో అన్నమయ్య జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జలధార' పేరుతో ఆ జిల్లాలో చేపట్టిన చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయని, స్థానిక జలవనరులను వినియోగించుకుని, చెరువులను నింపి భూగర్భ జలాలను గణనీయంగా పెంచారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.
ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 8.7 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలను, కనీసం 1.5 మీటర్ల మేర పైకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**పూడికతీత నుంచి వాటర్ బడ్జెట్ వరకు.. చేయాల్సిన పనులివే**

ఈ 100 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫీడర్ ఛానెళ్లను శుభ్రం చేయడం, చెరువులు, కాల్వల్లో పూడిక తీయడం, గుర్రపు డెక్కను తొలగించడం వంటి పనులను వెంటనే చేపట్టాలన్నారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వరద ముంపును కూడా అరికట్టవచ్చని తెలిపారు. అవసరమైన చోట చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయడం, కొత్త నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా, ప్రతి సాగునీటి సంఘం తమ పరిధిలో 'వాటర్ బడ్జెట్' తయారు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత, అవసరాలపై స్పష్టమైన అంచనాతో ముందుకు సాగాలన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.

**కరవు రహిత రాష్ట్రమే ధ్యేయం.. ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి**

కొద్దిపాటి శ్రద్ధ పెడితే రాష్ట్రంలో నీటి సమస్యను అధిగమించి, కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందని అన్నారని, కానీ నేడు హార్టీకల్చర్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులతో పాటు, నేడు పోలవరం సహా పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు.
గతేడాది (2024 మే నుంచి 2025 మే వరకు) ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు 2.20 మీటర్ల మేర పెరిగాయని, అంటే సుమారు 200 టీఎంసీల నీటిని అదనంగా భూమిలో ఇంకించగలిగామని తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ 100 రోజుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జగన్ పేరు కూడా అలాంటిదే

"గ్రామాల్లో శుభకార్యాల సమయంలో అమంగళకరమైన పేర్లు పలకకూడదని ఒక సంప్రదాయం ఉంటుంది. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'జగన్' అనే పేరు కూడా అలాంటిదే" అంటూ రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ అనుసరించిన వైఖరి రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని, ఆయనొక అభివృద్ధి నిరోధక శక్తి అని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తన కొత్త రాజధాని ప్రతిపాదనతో రాష్ట్ర ప్రజల ముందు నవ్వులపాలయ్యారని, సొంత పార్టీ శ్రేణులే ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు.

**జగన్... రాష్ట్రానికి పట్టిన చీడ**

రాష్ట్రానికి రాజధాని నిర్మాణం ఒక గొప్ప సంబరం లాంటిదని, అలాంటి సమయంలో జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపితే, ఒక్క వైసీపీ మాత్రమే పార్లమెంటులో వాకౌట్ చేసి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టిందని గుర్తుచేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన రాజధాని విషయంలో జగన్ వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని విమర్శించారు. ఆయన పాలనలో రాష్ట్రం ఐదేళ్ల పాటు చీకటి రోజులను చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**వికేంద్రీకరణ పేరుతో చారిత్రక తప్పిదం**

2019-24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదం శుద్ధ అబద్ధమని పార్థసారథి స్పష్టం చేశారు. "అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి రాగానే మాట మార్చారు. సూట్‌కేసు రాజకీయాలు చేస్తూ రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారు. ప్రజలు ఈ నాటకాన్ని గమనించి, మూడు రాజధానుల ఆలోచనను ఛీత్కరించి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు.
చేసిన తప్పులను ఒప్పుకోకుండా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా తన ఆలోచనలనే రుద్దే నియంతలా జగన్ వ్యవహరించారని మండిపడ్డారు. రాజధాని పేరును 'మావిగన్'గా మార్చాలని చూడటం ఆయన 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

**అమరావతి.. ఐదు కోట్ల మంది ఆత్మగౌరవం**

విభజనతో నష్టపోయిన ఆంధ్రులకు అమరావతి ఒక ఆత్మగౌరవ ప్రతీక అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. "ఏ నాయకుడూ చేయలేని సాహసాన్ని చంద్రబాబు చేశారు. ఆయన ఒక్క పిలుపుతో రైతులు 34,000 ఎకరాల విలువైన భూములను రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్'. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణకు లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. అదే స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందితే, ఏటా వచ్చే 4-5 లక్షల కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోని ప్రతీ మూలను అభివృద్ధి చేయవచ్చు" అని వివరించారు. అమరావతిలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు.

**కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు**

గత 20 నెలల కూటమి పాలనలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని పార్థసారథి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం సాధించలేకపోయిన
వేల కోట్ల రూపాయల కేంద్ర నిధులను సాధించి ప్రజా సంక్షేమానికి వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి సమగ్రాభివృద్ధి చేస్తున్నామన్నారు. కర్నూలుకు కారిడార్, ప్రకాశం-నెల్లూరు జిల్లాల్లో పోర్టులు, రిఫైనరీ, విశాఖను డేటా సెంటర్, సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.
"పెట్టుబడిదారులు వసతులు, కనెక్టివిటీ ఉన్న చోటుకే వస్తారు. జగన్‌లా 'చెట్టు కింద కూర్చుని చర్చలు జరపండి' అంటే ఎవరూ రారు" అని ఆయన ఎద్దేవా చేశారు. అప్పులు తెచ్చినా, సంపద సృష్టించి వాటిని తీర్చే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని, జగన్ ఇప్పటికైనా అబద్ధాలు మాని వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు.

# కడప జిల్లాలో కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు... తప్పిన పెను ప్రమాదం

వైఎస్ఆర్ కడప జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఓ ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగగా, డ్రైవర్ వేగంగా స్పందించడంతో అందులో ఉన్న 21 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లి సమీపంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 21 మంది ప్రయాణికులతో వేంపల్లి నుంచి కదిరికి బయలుదేరింది. వీరన్నగట్టుపల్లి వద్దకు రాగానే, రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు బస్సు పైభాగానికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. బస్సు లోపల పొగలు, మంటలు గమనించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు.వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులందరినీ హుటాహుటిన కిందకు దించారు. వారు దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే బస్సు కాలి బూడిదైంది.
విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడటమే ఈ దుర్ఘటనకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# బాసరకు మహర్దశ...రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయ పునరుద్ధరణ

- మొదటి పేజి తరువాయి

ప్రాశస్త్యం ఉన్న ఆలయ అభివృద్ధి పనులను అత్యంత శ్రద్ధతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. పునఃనిర్మాణ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ముందు అధికారులు శృంగేరి వెళ్లి పీఠాధిపతుల ఆశీస్సులు, అనుమతులు తీసుకున్నారు. గర్భాలయం, రాజగోపురం, మాడ వీధులు, కోనేరు వంటి నిర్మాణాలపై వారి సూచనలను స్వీకరించి, వాటికి అనుగుణంగా ప్రణాళికను ఖరారు చేశారు. సంప్రదాయాలకు, భక్తుల విశ్వాసాలకు ఎలాంటి భంగం కలగకుండా పనులు జరగాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**మూడు రెట్లు పెరగనున్న ఆలయ విస్తీర్ణం**

ఏటా లక్షలాది మంది చిన్నారులకు అక్షరాభ్యాసం జరిగే ఈ క్షేత్రానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రస్తుత ఆలయం ఇరుకుగా ఉండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని భారీగా విస్తరించనున్నారు. ప్రస్తుతం 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆలయ ప్రాంగణాన్ని ఏకంగా 62 వేల చదరపు అడుగులకు పెంచనున్నారు. అంటే ఆలయం మూడు రెట్లు విశాలం కానుంది. ఇందులో భాగంగా 2 వేల చదరపు అడుగుల గర్భాలయం, అర్ధమండపాన్ని 5 వేల చదరపు అడుగులకు విస్తరిస్తారు.

**శిలామయంగా... సకల సౌకర్యాలతో...**

పునఃనిర్మాణంలో భాగంగా ఆలయంలోని ప్రతి నిర్మాణం శాశ్వతంగా ఉండేలా శిలలతో చేపట్టనున్నారు. ఉత్తర దిక్కున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అంతస్తుల గోపురాలు నిర్మిస్తారు. ఆలయం చుట్టూ 33 అడుగుల
వెడల్పుతో మాడ వీధులు ఏర్పాటు చేస్తారు. ఈశాన్య దిక్కున పవిత్ర కోనేరు, తూర్పున ఆధ్యాత్మిక శోభతో తోరణాలు నిర్మిస్తారు. దాదాపు 6 వేల మంది భక్తులు వేచి ఉండేలా 70 వేల చదరపు అడుగులలో క్యూ కాంప్లెక్సులు, 200 మంది ఏకకాలంలో ధ్యానం చేసుకునేందుకు ధ్యాన మందిరం, విశాలమైన వంట, భోజనశాలలు, ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

**పుష్కరాల నాటికి భక్తులకు సౌకర్యాలు**

వచ్చే ఏడాది జూన్‌లో గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఆ సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం బాసరకు తరలివస్తారు. వారిని దృష్టిలో ఉంచుకొని ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయం నుంచి మరోవైపు వెళ్లేందుకు అండర్‌పాస్, సోలార్ రూఫ్‌టాప్‌తో కూడిన వాహనాల పార్కింగ్, ఆలయ ప్రాంగణంలో పుష్పవనం, హెల్త్ సెంటర్ వంటివి కూడా ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఉన్నాయి. ఈ పనులతో బాసర క్షేత్రం దేశంలోనే ఒక అద్భుతమైన పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకోనుంది.

# హర్మూజ్ జలసంధి తెరవకపోతే పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే రెండూ ఒకేసారి చూస్తారు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు నేరుగా, కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్ ను ఇప్పటికైనా తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు."ఇరాన్‌లో మంగళవారం నాడు పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే రెండూ ఒకేసారి ఉంటాయి.
అలాంటిది ఎప్పుడూ చూసి ఉండరు" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. "హర్మూజ్ జలసంధిని తెరవండి, లేదంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారు. మీరే చూస్తారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఇరాన్ కు ట్రంప్ 48 గంటల డెడ్ లైన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే, ట్రంప్ దూకుడు వైఖరిపై సొంత దేశంలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ యుద్ధం వల్ల దేశం మరో సుదీర్ఘకాల సంక్షోభంలోకి జారుకుంటోందని మేరీల్యాండ్ గవర్నర్ వెస్ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఎస్ న్యూస్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, "మనం ప్రమాదకరంగా మరో శాశ్వత యుద్ధంలోకి వెళుతున్నాం. అసలు మన లక్ష్యం ఏంటో, ఏ లక్ష్యం సాధిస్తే విజయం అనాలో ఎవరికీ స్పష్టత లేదు" అని అన్నారు. ఈ యుద్ధం వల్లే గ్యాస్ ధరలు డాలర్‌కు పైగా పెరిగాయని, ఇది ప్రజలపై భారం మోపుతోందని ఆయన తెలిపారు.
మరోవైపు, అమెరికా బలగాలకు సేవలందించే క్యాథలిక్ చాప్లిన్‌ల పర్యవేక్షకుడు, ఆర్చ్‌బిషప్ తిమోతి బ్రోగ్లియో ఈ యుద్ధానికి నైతిక సమర్థన లేదని స్పష్టం చేశారు. "ధర్మబద్ధమైన యుద్ధ సిద్ధాంతం (జస్ట్ వార్ థియరీ) ప్రకారం ఇది సరైంది కాదు. ముప్పు పూర్తిగా ఏర్పడక ముందే మనం స్పందిస్తున్నాం" అని అన్నారు. ఈ ఘర్షణలో అమాయక పౌరులు, సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధానికి మతపరమైన రంగు పులమడం సరికాదని, ఏసు ప్రభువు శాంతి సందేశాన్ని ఇచ్చారని గుర్తుచేశారు.

# ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సన్‌రైజ్ హాస్పిటల్స్ ఎండీ కుమారుడి పెళ్లి రిసెప్షన్ కు లోకేశ్ హాజరు...

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలో జరిగిన ఓ వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. విజయవాడకు చెందిన సన్‌రైజ్ హాస్పిటల్స్ ఛైర్మన్, ఎండీ డాక్టర్ మాదాల నరేంద్ర కుమార్ తనయుడి వివాహ రిసెప్షన్‌లో ఆయన పాల్గొన్నారు.మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఈ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్, నూతన వధూవరులు సాయి శిశిర్, వైష్ణవిలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని లోకేశ్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.వధూవరులతో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంటూ, "విజయవాడ సన్ రైజ్ హాస్పిటల్స్ ఎండీ, ఛైర్మన్ డాక్టర్ మాదాల నరేంద్ర కుమార్ గారి తనయుడి వివాహ రిసెప్షన్‌కు హాజరై నవ దంపతులు సాయి శిశిర్, వైష్ణవిలను ఆశీర్వదించాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, రిసెప్షన్ వేదిక వద్ద లోకేశ్ రాకతో కోలాహలం ఓ రేంజిలో నెలకొంది. పెళ్లికి వచ్చినవాళ్లు లోకేశ్ తో సెల్ఫీలకు పోటీ పడ్డారు. లోకేశ్ నవ్వుతూ ఓపిగ్గా సెల్ఫీలు ఇచ్చారు.

# జగన్ దీనికేమని సమాధానం చెబుతారు?


- మొదటి పేజి తరువాయి

ఖర్చుతో పోలుస్తూ ఆయన కొన్ని సంచలన లెక్కలను బయటపెట్టారు.
"ఆంధ్రుల కోసం కడుతున్న రాజధానికి చదరపు అడుగుకి రూ.12,000 అవుతుందని జగన్ అబద్ధాలు చెబుతున్నారు. అలాంటప్పుడు తన విలాసాల కోసం కట్టిన రుషికొండ ప్యాలెస్‌కు ఇంత భారీగా ఎందుకు ఖర్చు చేశారు? దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారు?" అని కన్నా లక్ష్మీనారాయణ నిలదీశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, రాజధాని విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.అమరావతి నిర్మాణానికి చదరపు అడుగుకు అయ్యే ఖర్చు కేవలం రూ.6,985 మాత్రమేనని కన్నా పేర్కొన్నారు. అదే సమయంలో, జగన్ తన సొంత విలాసాల కోసం కట్టించుకున్న రుషికొండ ప్యాలెస్‌కు చదరపు అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. ఈ వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అంతేకాదు, పోలిక కోసం ఆయన తెలంగాణ కొత్త సచివాలయానికి చదరపు అడుగుకు రూ.6,500, ఢిల్లీలోని కొత్త పార్లమెంటు భవనానికి రూ.17,291 ఖర్చయిందని వివరించారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# జగజ్జీవన్ రామ్‌కు ఘననివాళి

## - ఎమ్మెల్యే ఇంటూరి



**ఉలవపాడు పెన్ పవర్, ఏప్రిల్ 5**

మాజీ ఉపప్రధాని జగజ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఉలవపాడు మండలం చాకిచెర్ల గ్రామంలో ఆయన విగ్రహానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక యువత ఏర్పాటు చేసిన కేక్ ను ఎమ్మెల్యే కట్ చేసి, వారికి తినిపించారు. దళితుల అభివృద్ధికి జగజ్జీవన్ రామ్ చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, సుదర్శి శ్రీను, స్థానిక నేతలు పున్నేపల్లి పేరయ్య, పున్నేపల్లి రవి, మోహన్ రావు, కొండు , రేవంత్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా నెమలిగుండ్ల రంగనాయక స్వామి రధోత్సవం

### నలమల్ల గిరుల్లో రథం పై విహరించిన రంగస్వామి

### గోవిందా నామస్మరణతో మార్మోగిన్ నలమల్ల గిరులు

### ఆకట్టుకున్న కోలాటం అగ్గి సేవలు

### రథం లాగేందుకు పోటీపడ్డ భక్తులు





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 5**

రాచర్ల మండలం జె. పుల్లల చెరువు గ్రామ సమీపంలో నలమల్ల గిరుల్లో స్వయంభువుగా వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవం లో భాగంగా 3 వ రోజు రథోత్సవం అంరంగవైభవంగా సాగింది. ఇరువురు దేవీరుల సహిత రంగనాయక స్వామిని సుందరంగా అలంకరించి లక్షమ్మ వనం సమీపంలోని రథం వద్దకు స్వామివారి ఉత్సవ మూర్తులను తీసుకువచ్చారు. వివిధ రకాల పువ్వులతో , విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథం లో స్వామి వారి ఉత్సవమూర్తులను అధీష్టింప చేసి ఆగమ శాస్త్రం ప్రకారం సకల పూజాకార్యక్రమాలను అర్చక స్వాములు నిర్వహించారు. ముందే విష్వక్సేనుల వారు రథం తిరుగు మాదవీధులో విహరించి రథోత్సవానికి మార్గం సుగమం చేశారు. అనంతరం శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి బూడిదగుమ్మడి కాయ పై కర్పూరం వెలిగించి త్రిప్పి పగులగొట్టి రథోత్సవం ను ప్రారంభించారు. వెంటనే రథం నలమల్ల గిరుల్లో ఉత్సవం సాగింది. భక్తుల గోవిందనామాలు గిరుల్లో మారుమ్రోగాయి. రథంను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథంలో ఇరువురు దేవేరులతో రంగనాయక స్వామి దర్శనమిచ్చారు. నలమల్ల గిరులు ఆధ్యాత్మికశోభ సంతరించుకున్నాయి. శ్రీరంగ నాయక స్వామి కల్యాణ మూర్తులు రథం లో విహరిస్తుండగా అతవిలోని చెట్లు చేమలు, పక్షులు పర్వశించిపోయాయి. ప్రకృతి పులకించింది. ఒకప్రక్క వేదపండితుల వేద మంత్రోచ్చారణ, మరోప్రక్క కోలాటం, కులుకు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కాకుండా శ్రీ రంగనాయక స్వామి సేవ (అగ్గిసేవ) భక్తులలను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. గోవింద నామ స్మరణ తో నలమల్ల గిరులు మార్మోగాయి ఈఏడాది ఈప్రాంత ప్రజలే కాకుండా పొరుగుప్రాంతలు, పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భరహోత్సవాలను నిర్వహించారు నెలరోజులుగా అన్నిశాఖల అధికారులను సమన్వయం చేస్తూ , సమీక్షలు నిర్మావహించి ఎక్కడ ఏ భక్తులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా సకలం సవ్యంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈసారి విఐపిల తాకిడికూడాబెక్కువగానే ఉంది. అశోకుడు అన్ని తానై బ్రహోత్సవాలు పకడ్బందీగా నిర్వహించారు. ఆయన చతురత ,చాకచక్య కార్యదక్షత పట్టుదల నిర్ణయాలు తీసుకోవడం,నిర్వహణ సామర్ధ్యాన్ని పలువురు ప్రశంసిస్తూ న్నారు. ఈ బ్రహోత్సవాలు నియోజకవర్గం లో కీర్తి పతాకగా నిలిచిపోయాయి.

# బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పించిన దివి శివరాం



**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 5**

భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా పట్టణంలోని చర్చి సెంటర్ లో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివ రాం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ దళితులకు డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ రాజ్యాంగంలో హక్కులు కల్పిస్తే , జగ్జీవన్ రామ్ వాటిని చట్ట రూపంలో అమలు చేయడానికి కృషి చేశారన్నారు. కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి సమసమాజ స్థాపన కోసం జగ్జీవన్ రామ్ పాటుపడ్డారు. కేంద్రంలో అత్యధిక కాలం కేంద్ర మంత్రిగా పనిచేసి అనేక శాఖలను సమర్థవంతంగా నిర్వర్తించి అందరికి ఆదర్శ ప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో హరిత విప్లవానికి నాంది పలికి రైతులకు మేలుచేసే అనేక చట్టాలు రూపొందించారు అని అన్నారు. కార్మికశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కార్మికుల సంక్షేమం కొరకు అనేక చట్టాలు చేశారు. ఆ చట్టాలే నేడు కూడా అమలు అవుతున్నాయన్నారు అని అన్నారు.రక్షణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పాకిస్థాన్ తో జరిగిన యుద్ధములో భారతదేశం విజయం సాధించడములో జగ్జీవన్ రామ్ కీలకపాత్ర పోషించారు అని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడంతో పాటు అన్ని జిల్లాల్లో జగజ్జీవన్ రామ్ విగ్రహాలు నెలకొల్పి ఆయన పేరిట జగ్జీవన్ భవనాలు నిర్మించడంతో పాటు ఆయన పేరు మీద అనేక పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు , విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు , నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య , నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా (రూబీ) , తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ , కందుకూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు ముచ్చు శ్రీనివాసరావు , ఉన్నం పాండు , నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , వలేటి వారిపాలెం మండలం తెలుగుయువత అధ్యక్షులు బద్దిపూడి శిఖామణి , కందుకూరు నియోజకవర్గం తెలుగుయువత ఉపాధ్యక్షులు జడ రవీంద్రబాబు , కందుకూరు నియోజకవర్గం ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఇంటూరి

## -రెవిన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలో గ్రామసభలు



**ఉలవపాడు పెన్ పవర్, ఏప్రిల్ 5:**

మీ భూమి – మీ హక్కు కార్యక్రమంలో భాగంగా ఉలవపాడు మండలం చాకిచెర్ల పంచాయతీలో 532 మందికి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీలో 1671 పాస్ పుస్తకాలకు గాను, ప్రస్తుతానికి ఎలాంటి తప్పులు లేకుండా 532 పుస్తకాలు రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన పుస్తకాల్లో తప్పులను సరిచేసి రైతులకు త్వరలోనే అందిస్తామన్నారు. గత వైసిపి పాలనలో చేతగానితనంతో నిర్వహించిన రీసర్వే కారణంగానే రైతులకు ఇబ్బందులు వచ్చాయని ఎమ్మెల్యే



నాగేశ్వరరావు విమర్శించారు. పైగా మన పూర్వీకుల ఆస్తులకు సంబంధించిన పుస్తకాలపై జగన్ ఫోటోలు వేసి తుగ్లక్ అనిపించుకున్నాడని అన్నారు. అలాంటి తలతిక్క పనులు చేసినందుకే, 11 సీట్లకు పరిమితం చేశారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులు, రైతుకూలీల బాగుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కష్టపడుతున్న విషయాన్ని రైతులు గమనించాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన అనుభవమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ముద్రించిన పుస్తకాలు ఇస్తున్నామని, దానిద్వారా రైతులు తమ భూముల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. క్యూ ఆర్ కోడ్ కారణంగా అక్రమాలు జరిగేందుకు వీలులేదన్నారు. రీసర్వే తప్పులను సరిచేసి, రైతులకు న్యాయం చేయడం కోసం త్వరలోనే అధికారులు గ్రామసభలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. రెవెన్యూ అధికారులు కూడా రైతు సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, నీటి సాగునీటి సంఘం అధ్యక్షురాలు ఎందేటి సుశీల, గంటా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు సుదర్శి శ్రీను, కొప్పోలు రవి, మిరియం భాస్కర్, పాములపాటి శ్రీనివాసులు, తుళ్ళూరి భాస్కర్, పున్నేపల్లి రవి, పేరయ్య, మోహన్, తాటితోటి రవి, చిన్నపాలెం పోతురాజు, రఘు, మానికల వెంకటేశ్వర్లు, ఆవుల వాసు, యనమల రామారావు, రమేష్, పుల్లా వెంకట్, నరసింహనాయుడు, బెల్లం వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం....రమణీయం

## -శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవం





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 5:**

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణంలోని పెద్దబజారులో గల శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.ఆలయ కమిటీ ఆహ్వానంతో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొని, శ్రీ సీతారాములను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ ఆగమ పండితులు గుడవర్తి అనంత వెంకట దీక్షితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు ఎమ్మెల్యేను ఆత్మీయంగా ఈ వేడుకకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, సభ్యులు చిన అల్లూరయ్య, గుర్రం సింగయ్య, మురారిశెట్టి శ్రీను, మద్దాలి సురేష్ ,గుర్రం అల్లూరయ్య, ఆర్యవైశ్య నేతలు మురారిశెట్టి సుధీర్, మోదడుగు వెంకటేశ్వర్లు, తాతా లక్ష్మీనారాయణ, కోట కిషోర్, చీదెళ్ల వేణు, కంకణాల వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి రాజా, మురారిశెట్టి శ్రీను, దేసు వెంకటేశ్వర్లు, మురారిశెట్టి వెంకటేష్, మద్దాలి రామకృష్ణ, టిడిపి నేతలు ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీను, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చక్రస్నానంతో ముగిసిన నెమలిగుండ్ల రంగడి బ్రహోత్సవాలు

## చక్రస్నానం పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 5**

రాచర్ల మండలం జె. పుల్లల చెరువు గ్రామ సమీపంలో నలమల్ల ప్రకృతి సోయగాల నడుమ స్వయంభువు గా వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోచవాలు ఆదివారం స్వామి వారి చక్రస్నానం తో వైభవంగా ముగిశాయి. ఈ చక్రస్నానం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ కనీ వినీ ఎరుగని విధంగా స్వామి వారి చక్రస్నానం శాస్త్రోక్తంగా , భక్తి శ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నెమలి గుండంలో నిర్వహించారు ఈ చక్రస్నానం మహోత్సవం లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆయన ధర్మపత్ని పుష్పలిలా లు పాల్గొని ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఇరువురు దేవేరుల సహిత నెమలి గుండ్ల రంగడి ఉత్సవమూర్తుల ను వెంచిప చేసి గట్టు పై అధిష్టింపచేసి శాస్త్రోక్తంగా పూజాధికార్య క్రమాలను నిర్వహించారు. గుండంలో అనంతరం చక్రస్నానం చేయించారు ఈకార్యక్రమం లో ఎమ్మెల్యే ముత్తు ముల చక్ర స్నానంలో పాల్గొన్నారు. వేద మంత్రాలను పండితులను వల్లిస్తుండగా చక్రస్నానం ఆచరించారు. దీంతో బ్రహోత్సవాలు అంగ రంగ వైభవంగా ముగిశాయి. ఈ బ్రహ్మోత్సవాల మొదలు మొదటి రోజు అంకురార్పణ, రెండవ రోజు కళ్యాణం , సంస్కృతిక కారక్రమాలు, మూడవ రోజు బండ పందెము , తెప్పోత్సవం నేడు చక్రస్నానం తో స్వామి వారి బ్రహ్మోత్సవం వేడుకలు పూర్తి అయ్యాయి. ఎమ్మెల్యే ప్రత్యేక పూజ లో భాగంగా స్వామి వారి నీ స్వయంగా దేవాలయ గుండం నందు అభిహిషేకం నిర్వహించారు , భక్తులకు స్వయంగా అభిషేకం లనిర్వహించారు అనంతరం బ్రహ్మోత్సవాలు ఎంతో చక్కగా





నిర్వహించిన కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య ను శాలువ పూలమలతో ఘనంగా సన్మానించారు, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ బ్రహ్మోత్సవాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర నలుమూలల నుండి వేలాది మంది భక్తులు , ప్రజలు పాల్గొని స్వామి వారి మ్రొక్కులు చెల్లించుకున్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

## నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 5**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ పేరు పొందిన స్వాతంత్ర సమరయోధుడు సంఘసంస్కర్త రాజకీయవేత్త బీహార్ లోని వెనకబడిన వర్గాల నుంచి ఆయన వచ్చారని , బాబుజీగా ప్రసిద్ధుడు భారత పార్లమెంట్లో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆలిండియా డిప్రెస్ట్ క్లాస్ లీక్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడన్నారు 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారని, ఆ తర్వాత 1946లో జవహర్లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి చిన్న వయసులో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక మంత్రి భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడు ఈయన యొక్క స్ఫూర్తి పోరాటం మన యువతకు విలువలతో కూడిననాయకులకు నాయకత్వానికి ఒక మంచి ఆదర్శనీయుదన్నారుకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు జయంతి వేడుకలో పాల్గొని నివాళులు అర్పించారు.

# నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ జిల్లా చైర్మన్‌గా తంగిరాల అశోక్ రెడ్డి



**మార్కాపురం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ మార్కాపురం జిల్లా చైర్మన్ గా తంగిరాల అశోక్ రెడ్డి బాధ్యత స్వీకరణ కార్యక్రమం రాష్ట్ర రాజధాని అమరావతి లో ఎన్ డబ్ల్యూ సి రాష్ట్ర చైర్మన్ అంబటి నవ కుమార్ అధ్యక్షతన జరిగింది . తనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల తంగిరాల అశోక్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుకి, రాష్ట్ర చైర్మన్ శ్రీ నవ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంపదల సంరక్షణ, ప్రజల్లో అవగాహన పెంపు కోసం ప్రకృతి పట్ల ప్రజలకు, వ్యవస్థలకు మరింత బాధ్యతగా వ్యవహరించడంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలపరిచే దిశగా తాను కృషి చేస్తానని అశోక్ రెడ్డి తెలిపారు.ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడానికి సమాజంలోని ప్రతి వర్గం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# గాంధీ పార్కును అధికారులు పట్టించుకోరా

## అధికారులను ప్రశ్నించిన డాక్టర్ షేక్ మహబూబ్ వలి



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 5**

జిల్లా కేంద్ర మైన మార్కాపురం పట్టణం నడి బొడ్డున ఉన్న గాంధీ మున్సిపల్ పార్క్ అపరిశుభ్రం గా ఉన్న మున్సిపల్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ప్రశ్నించారు.ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పార్క్ ను పరిశీలించారు.గాంధీ మున్సిపల్ పార్క్ లో చెత్తా చెదారాలతో మందు బాటిల్లు,డిస్పోజల్ గ్లాసులతో చాయ్ కప్పులులతో,పాతబట్టలు, జంతువుల మల విసర్జనలతో అపరిశుభ్రంగా ఉందన్నారు. మున్సిపల్ అధికారులు పార్క్ ను ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.మన భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వచ్ఛభారత్ అభియాన్ ప్రారంభిస్తే,మన గాంధీ పార్కు స్వచ్ఛభారత్ అభియాన్ లో లేదా అని అన్నారు.అధికారులు మహాత్మా గాంధీ మున్సిపల్ పార్కు పరిశుభ్రత పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్,ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ అబ్దుల్లా,మార్కాపురం నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాసిం వలి, కాంగ్రెస్ పార్టీ కేకేసి మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈస్టర్ వేడుకలు

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 5**

మండల కేంద్రంలో ఈస్టర్ పండుగ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవులు యేసు క్రీస్తు పునరుత్థానాన్ని స్మరించుకుంటూ ఈస్టర్ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రార్థనా మందిరానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చ్ ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మిక గీతాలతో మార్మోగిపోయింది.యేసు లేచెను ఆదివరమున జయ జయ యేసు జయ యేసు అంటూ విశ్వాసులు ఉత్సాహంగా ఈస్టర్ ప్రత్యేక కీర్తనలు ఆలపించి వీధులలో కొవ్వొత్తులతోర్యాలీ నిర్వహించారు. ప్రార్థనల సందర్భంగా యేసు క్రీస్తు త్యాగం, ఆయన పునరుత్థానం విశ్వాసులకు అందించే ఆశ, ధైర్యం, విమోచన సందేశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ సందర్భంగా పాస్టర్ ఆర్. ఆనందరావు ప్రసంగిస్తూ ఈస్టర్ పండుగ యొక్క ప్రాముఖ్యతను విశదీకరించారు. యేసు క్రీస్తు సిలువపై మరణించి మూడవ రోజు తిరిగి లేచిన సంఘటన క్రైస్తవ విశ్వాసానికి పునాది అని



తెలిపారు. పాపాల నుండి విముక్తి, నిత్యజీవానికి మార్గదర్శకత్వం యేసు పునరుత్థానం ద్వారా లభించిందని ఆయన అన్నారు. ప్రతి విశ్వాసి ప్రేమ, క్షమ, త్యాగం అనే విలువలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.ఇక గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. యేసు సిలువపై పలికిన ఏడు



మాటలు ఆధారంగా నిర్వహించిన ప్రత్యేక పరీక్షల్లో యువత, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.మొత్తంగా ఈస్టర్ వేడుకలు భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిండిపోయి విశ్వాసుల హృదయాల్లో నూతన ఆశలను నింపాయి.విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశ జ్యోతి బాబు జగ్జీవన్‌రామ్...



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 5**

పుల్లల చెరువు మండల కేంద్రంలో సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలిచిన మహానేత బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన సభలో పలువురు వక్తలు ఆయన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. భారత రాజకీయాల్లోనే కాకుండా, వెనుకబడిన వర్గాల హక్కుల సాధనలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు.ఈ సందర్భంగా లింగంగుంట్ల రాములు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆజన్మాంతం శ్రమించిన ధీశాలి బాబూ జగ్జీవన్ రామ్ అని, సామాజిక సమానత్వానికి ఆయనే పునాది వేశారని కొనియాడారు.ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన బాబుజీ, నాటి కాలంలో ఉన్న అస్పృశ్యత, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను విద్యార్థి దశ నుంచే ధైర్యంగా ఎదుర్కొని జన చైతన్యం తెచ్చిన గొప్ప సంస్కర్త అని వారు గుర్తుచేశారు.అధికారంలోకి వచ్చి వ్యవస్థను మార్చాలని నమ్మిన ఆయన, ఐదు దశాబ్దాల పాటు పార్లమెంటేరియన్ గా చట్టసభల్లో తన ముద్ర వేశారని ఆయన అన్నారు.దేశాభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సమాన గౌరవం.అవకాశం లభించడమేనని నమ్మిన బాబుజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన స్పష్టం చేశారు.బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా యువత వాటిని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.సమాజంలో ఇంకా కొనసాగుతున్న అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఎమ్మార్పీఎస్ యువత చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బడిపాటి ఓబులు, వెంకటేశ్వర్లు, బడిపాటి మరియదాస్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 5**

మండల కేంద్రంలోని స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప రాజకీయవేత్త బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మండల ఎం ఆర్ పీఎస్ సీనియర్ నేత సింగా ఎర్రబుషి ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బీహార్ లోని వెనుకబడిన వర్గాల నుండి వచ్చిన జగ్జీవన్ రామ్ భారత పార్లమెంటులో 40 ఏండ్లపాటు వివిధ మంత్రి పదవులను నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రానికి ఎస్సై ఎస్. వెంకట రమణయ్య పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సన్నిధి కిషోర్, కటికల దానం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యలకపాటి చెంచయ్య, పూర్ణకంటి వెంకయ్య, దర్శనం పెద్ద బాబు, కటికల జీనా, జడ్డ హానోక్, ఎం ఆర్ పి ఎస్ నాయకులు పాల్గొనారు.

# జగ్జీవన్ రామ్ మార్గం నేటికీ అనుసరణీయం

## -బాపూజీ జగజ్జీవన్ రామ్ జయంతి సభలో వక్తలు పిలుపు

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 5:**

స్వాతంత్ర సమరయోధుడు సంఘసంస్కర్త రాజకీయవేత్త దళిత బడుగు బలహీన వర్గాల ప్రజాప్రతినిధి భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా కందుకూరు పట్టణంలోని చర్చి సెంటర్ నందుగల జగజ్జీవన్ రామ్ కు నివాళులు అర్పించారు. విగ్రహ కమిటీ, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ, ముస్లిం ఐక్యవేదిక, హెల్ప్ సపరర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ సలహాదారులు ముప్పవరపు కిషోర్, ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, జగజీవన్ రామ్ విగ్రహ కమిటీ అధ్యక్షులు గౌడపేరు ఏసు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ , ఏ ఏ డి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గేరా చిరంజీవి, బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్. అబ్దుల్లా, కందుకూరి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తొండల ఆదాము, దమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు గాండ్ల హరిప్రసాద్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఏఏడి అసోసియేషన్ ఉపాధ్యక్షులు చనమాల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ ఏ పదవిని అలంకరించిన దానికి వన్నె తెచ్చే విధంగా వ్యవహరించే వారని, ఆధునిక భారత నిర్మాణానికి అహర్నిశలు పనిచేసిన సుదీర్ఘకాల పార్లమెంటేరియనని ఆయన సేవలను కొనియాడారు. భారతదేశ హరిత విప్లవానికి నాంది పలికిన వాడని, కార్మిక సంక్షేమానికి పునాది వేసిన వాడని, అనేక భారత గ్రామీణ కార్మిక ఉద్యమాలను నిర్మించాడని, అంటరాని వారి సమానత్వం కోసం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించి అంకిత భావంతో పనిచేశాడు. హిందూ మహాసభ సెషన్స్ లో దళితుల పట్ల వివక్షత ప్రదర్శించకూడదని వారికి కూడా దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలని తాగునీటి బావుల్లో వివక్షత ప్రదర్శించకూడదని క్రియాశీలకంగా ఉద్యమాలు నడిపాడు. సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్షణ సైతం ఎదుర్కొన్న దీరోధాత్రుడు జగజ్జీవన్ రామ్ అని అన్నారు. ఆ మహానుభావుడు సాధించిన హక్కులు నేడు పాలకవర్గాలు కాలరాస్తున్నాయని రాజ్యాంగం తుంగలో తొక్కబడుతున్నాదని పాలకవర్గ కుట్రలను ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ ప్రజలు సమిష్టిగా ఎదుర్కొని హక్కులను కాపాడుకోవాలని అన్నారు. మతం మారితే షెడ్యూల్ కులాల వారు తమ



రక్షణ చట్టాలను విద్య ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కోల్పోతారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగము యొక్క మౌలిక స్వభావాన్నికీ భిన్నంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రావులకొల్లు బ్రహ్మానందం, బద్దిపూడి జయరావు, గేరా మనోహర్, ఉచ్చులూరి రవీంద్ర, గౌడపేరు క్రాంతి కుమార్, ముప్పవరపు కోటేశ్వరరావు, ముప్పవరపు రమేష్, కల్లగుంట మోహన్ రావు, వల్లూరి కోటేశ్వరరావు, షేక్ రహీం, దగ్గుమాటి కళ్యాణ్, దేవరకొండ ఆదిలక్ష్మి, బిరుదుల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 5**

పొదిలిలో దివంగత నేత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏబీఎన్ స్కూల్ వద్ద గల బాబు జగ్జీవన్ రామ్, బిఆర్ అంబేద్కర్ ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశానికి ఉప ప్రధానిగా డాక్టర్ బాబు జగజీవన్ రామ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అటువంటి మహనీయుని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ గట్టి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వి సురేష్, ఎం కిరణ్, కే అశోక్, బి బెంజిమెన్, కే సామ్యూల్, టి నరసింహారావు, ఏ రవి, జి నాగులు , ఐజాక్, కిషోర్ బాబు, ఎలీషా, చైతన్య, సురేష్, జి అరుణ్, జి చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దరాజుపాలెంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామంలో ఆదివారం ఈస్టర్ పర్వదినం ఎంతో భక్తి, శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ప్రభువు పునరుత్థానాన్ని స్మరించుకునే ఈ మహోన్నత రోజున చర్చిని ప్రత్యేక అలంకరణలతో అందంగా తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవ సందేశం ఇచ్చారు ఉదయం ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారుఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ, శుభ శుక్రవారం రోజున క్రీస్తు శిలువ శ్రమ, శిలువ మరణం అనుభవించి మూడు రోజులు అనంతరం తిరిగి లేచారని, పాప విమోచన కొరకు చేసిన త్యాగమని, మూడవ రోజు ఆదివారం పునరుత్థానంతో మానవాళికి ఆశ, శాంతిని అందించారని తెలిపారు. క్రీస్తు తన పవిత్ర రక్తంతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని ప్రసాదించాడని భక్తులకు సందేశాన్ని వివరించారు. క్రీస్తు పట్ల విశ్వాసం కలిగిన వారికి ఆయన అనుగ్రహం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని, ప్రభువు చూపిన మార్గంలో శాంతి, సహనం, పరస్పర సహకారంతో సమాజంలోని అన్ని వర్గాలు జీవించాలని పిలుపునిచ్చారు. ఏసుక్రీస్తు ప్రజలను కాపాడడానికి భూమి పైకి వచ్చిన రోజునే ఈస్టర్ గా జరుపుకుంటామని చెప్పారు ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్థనలకు హాజరైన ఏ భక్తులు భక్తి గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.

# జగజ్జీవన్ రామ్ ఆశయాలు కొనసాగిద్దాం

## -ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 5:**

మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర సమరయోధులు బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం చర్చి సెంటర్ లో జగజ్జీవన్ రామ్ విగ్రహానికి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా దేశం కోసం పోరాడిన జగజ్జీవన్ రామ్ తర్వాత దళితుల హక్కులు, వారి అభివృద్ధి కోసం ముందుండి ఉద్యమం నడిపారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం, అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ పాలనలో దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, లింగసముద్రం మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, గుడ్లూరు మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూరిమిట్ల మాల్యాద్రి, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, పార్టీ నేతలు రాయపాటి శ్రీను, గోచిపాతల మోషే, గురజాల బెంజిమన్, మట్టిగుంట శ్రీను, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మెండా లెనిన్, దువ్వూరి రమేష్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, పార్టీ నేతలు ఉప్పుటూరి శ్రీను, వంకాయలపాటి మాల్యాద్రి, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వడ్డెళ్ళ రవిచంద్ర, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన కృష్ణ, చుండూరి శ్రీను, వంకదారి శ్రీను, గుమ్మా శివ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు

### ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 5**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ మున్సిపల్ పార్కు వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్వతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్త, రాజకీయవేత్త. భారత పార్లమెంటులో దాదాపు 40 ఏళ్లు వివిధ మంత్రి పదవిలో నిర్వహించడమే కాకుండా భారత ఉప ప్రధానమంత్రిగా వ్యవహరించారన్నారు. 1946లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జవహర్లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతిపిన్న వయసుకుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టారాని గుర్తుచేశారు. భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్లో కార్మిక శాఖ మంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ లో సభ్యుడు కూడా అని అన్నారు. 1971 సంవత్సరంలో ఇండియా పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో ఆ సమయంలో జగ్జీవన్ రామ్ భారత దేశ రక్షణ శాఖ మంత్రిగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ అబ్దుల్లా, మార్కాపురం నియోజకవర్గ మైనార్టీ సెల్స్ చైర్మన్ షేక్ ఖాసిం వలి, నియోజకవర్గ కేకేసి అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాలుగున్నారు.

# జిల్లాస్థాయి జిఎఫ్ ఎల్ ఎల్ పోటీలలో పి అమృత ప్రథమ



**పెన్ పవర్ ఏప్రిల్ 5**

జిల్లాస్థాయి జి ఎఫ్ ఎల్ ఎన్ పోటీ పరీక్షల్లో వెల్లటూరు ప్రాథమిక పాఠశాల ఐదవ తరగతి విద్యార్థిని పి అమృత ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలో ప్రథమ స్థానం వచ్చినందుకు ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ముప్పాళ్ళ పిఎసిఎస్ చైర్మన్ మన్నెం రమణయ్య అమృతను అభినందించి ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రాథమిక తరగతుల్లోనే పిల్లలకు చదవడం, రాయడం చిన్నపాటి లెక్కలు వంటి కనీస నైపుణ్యాలు బలపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారావు, మహాలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ మహేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 5**

మండల కేంద్రంలోని మండల పాస్టర్స్ మరియు ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారంఈస్టర్ పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈస్టర్ పండుగ సందర్భంగా మండల పాస్టర్స్ యూనియన్ సేవకులు అందరూ కలిసి ప్రయాణికులకు మరియు ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం ఎంతో అభినందనీయమని ఇటువంటి కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినందుకు మండల పాస్టర్ యూనియన్ కమిటీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల పాస్టర్స్.ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుట్టి పాల్ స్పర్జన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అసోసియేషన్ ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన అనేక కార్యక్రమాలు చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజక వర్గ పాస్టర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ చాట్ల గంగయ్య , మండల పాస్టర్స్ మరియు ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ సింగా యేసుదానం, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పాస్టర్ మేడిపల్లి అశోక్ కుమార్, అసోసియేషన్ ట్రెజరర్ రెవరెండ్ యలకపాటి రంజిత్ రాజ్ , గౌరవ సలహాదారులు బేతం యోహాను , రెవరెండ్ పూర్ణ కంటి జేమ్స్ , బ్రదర్ దర్శనం ఇమ్మానియేల్, బ్రదర్ కోడి శ్రీను బ్రదర్ బూదాల సుబ్బయ్య అసోసియేషన్ లోని సేవకులు పాల్గొనడం జరిగింది. ఈస్టర్ సందర్భంగా దోర్నాల మండలం పాస్టర్స్ అసోసియేషన్ వారు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం మాకు చాలా సంతోషంగా ఉందని ప్రజలు తెలియజేయడం జరిగింది.

# జగజీవన్ రామ్ చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయం

### జిల్లా లోక్ సత్తా అధ్యక్షులు చంద్రశేఖర్



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 5**

భారత ఉప ప్రధానిగా దివంగత నేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయమని జిల్లా లోక్ సత్తా పార్టీ అధ్యక్షులు ఎస్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నాడు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా ఒంగోలు పట్టణంలోని లోక్ సత్తా పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**కొనకనమిట్ల పెన్ పవర్ ఏప్రిల్ 5**

భారత మాజీ ఉప ప్రధాని,సామాజిక సంస్కరణోద్యమాల పితామహుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు కొనకనమిట్ల మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,ప్రజా ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పొదిలి సీపీఎం పార్టీ కన్వీనర్ పి. బాలనరసయ్య,మాజీ సర్పంచ్ బోదాల జోసెఫ్ కమలాకర్‌రావు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడిగా ఆయన నిలిచారని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో భాగంగా శాసనోల్లంఘన ఉద్యమం,క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి కార్మిక సంక్షేమానికి అనేక చట్టాలను అమలు పరచడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాల అభివృద్ధికి రిజర్వేషన్ విధానాలను బలపరచడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. సమానత్వ సమాజ నిర్మాణంలో ఆయన ఆలోచనలు యువతకు మార్గదర్శకమని వివరించారు. ఈ కార్యక్రమంలో వాగుమడుగు మాజీ ఎంపీటీసీ మంచికల చిన్న కోటేశ్వరరావు,టైలర్ యూనియన్ మాజీ అధ్యక్షుడు పి. చిన్న,జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు పి. వి. కొండయ్య,చేబ్రోలు సిద్ధయ్య, సీఐటీయూ నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, వెలు గొండయ్య, పి. గంగయ్య,కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్ర యాదవ్ నిరాహార దీక్షకు బీసీలు తరలిరండి



**ఉలవపాడు పెన్ పవర్ ఏప్రిల్ 5:**

ఈనెల 11వ తేదీన మంగళగిరి భారత చైతన్య యువజన పార్టీ కార్యాలయము నందు రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష దీక్షను జయప్రదం చేయాలని మీడియం శ్రీనివాసులు కోరారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు రాజకీయంగా అణిచివేతకు గురి అయినటువంటి బీసీల కోసం నిరాహార దీక్ష చేస్తున్నారని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని, బీసీ కుల కార్పొరేషన్లకు వెంటనే నిధులు కేటాయించాలని 44 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ఆమరణ నిరాహారదీక్ష చేయటం చరిత్రలో ఒక మార్పుకు నిదర్శనంగా నిలుస్తుంది అని అన్నారు. బీసీల కోసం ఇంత త్యాగం చేయటం బీసీ అదృష్టంగా భావించి దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. ఆనాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లేకుంటే ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు వచ్చేవా అని అన్నారు. నేడు రామచంద్ర యాదవ్ బీసీలు ఆత్మగౌరవంగా జీవించాలని తమ ఓట్లు నిజాయితీగల నాయకులకు వేసి రాష్ట్రంలో రాజకీయ సునామీ సృష్టించాలని అలాగే ఏ కులం అధికారంలో ఉంటే ఆ కులం అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుందన్న విషయాన్ని బీసీలు గుర్తించి బీసీల రాజ్యం కోసం ఓటు వినియోగించాలని కోరారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఇప్పటివరకు ఎదురుచూసిన మనకు నేడు రామచంద్ర యాదవ్ బీసీల తల రాతలు మార్చటానికి ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. నేడు మన రాష్ట్రంలో వేలకోట్లు ఉన్న బహుజన నాయకులు ఉన్న తెలుగుదేశం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లలో కొనసాగుతూ ఆత్మ గౌరవం చంపుకొని అవమానాలకు గురి అవుతూ కాలం గడుపుతున్న నాయకులు ఇకనైనా మేల్కొని రామచంద్ర యాదవ్ అడుగులలో అడుగులు వేయాలని కోరారు. భవిష్యత్తులో రామచంద్ర యాదవ్ చేపట్టబోయేటువంటి కార్యక్రమాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటూ బహుజన రాజ్యం కోసం పాటుపడాలని కోరారు. ఇకనుండి ఓట్లు మనవే సీట్లు మనవి అనే విధంగా నూటికి 85 శాతం గా ఉన్న ప్రజలు రానున్న 2029వ సంవత్సర ఎన్నికలలో ఐక్యమత్యంతో బహుజన రాజ్యాధికారం కోసం పాటుపడాలని కోరారు. ఈనెల 11వ తేదీన రామచంద్ర యాదవ్ చేపడుతున్న ఆమరణ నిరాహార దీక్షకు బీసీ సంఘాలు కుల సంఘాలు ఇతర అభ్యుదయ వాదులు తమ పూర్తి మద్దతును ప్రకటించాలని కోరారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ జయంతి



**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 5**

భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ పుల్లారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో, ముఖ్యంగా అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం జగ్జీవన్ రామ్ చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. భారత పార్లమెంటరీ వ్యవస్థలో సుదీర్ఘకాలం పాటు వివిధ శాఖల మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

### జిల్లా కలెక్టర్ విజయ సునీత



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 5**

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, అనగారిని వర్గాల అభ్యున్నతికి ఆజన్మాంతం పనిచేసిన ధీరుడు బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తి భావితరాలుకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత కొనియాడారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ లో బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, భాజపా రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి ఏలూరు రామచంద్రా రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంటరానితనానికి వ్యతిరేకంగా విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసి జనచైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్ గా పనిచేసి చట్ట సభల్లో తన సత్తా చూపిన ఆయన ఆకరి క్షణం వరకు దళిత జాతి సముద్దరణ కోసమే తపించారన్నారు. నేటి తరం ప్రజలు ఆయన ఖ్యాతి, చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేద్కర్ తర్వాత అంతటి ఖ్యాతిని గడించిన ఘనత జగ్జీవన్ రామ్ కే దక్కుతుందన్నారు. మారుమూల గ్రామాల్లో నేటికి సైతం అంటరానితనం ఉందని ప్రతి ఒక్కరు దాన్ని విడనాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవిత గాథలను చదివి చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ ప్రేరణతో స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనడంతో పాటు రాజ్యాంగ రచనా కమిటీ సభ్యునిగా తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి చరిత్రలో నిలిచిపోయారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ డ బ్ల్యూ వో శివనాయక్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, జిల్లా మలేరియా అధికారి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభ్యున్నతికి సర్పంచ్‌ల కృషి భేష్ -అన్నా రాంబాబు

**మార్కాపురం టౌన్,పెన్ పవర్ ఏప్రిల్ 5**

ఒక వైపు ప్రభుత్వ సహకారం, తోడ్పాటు లేకపోయినా రాజకీయంగా అధికారులు వివక్ష చూపినా సర్పంచులందరూ ధైర్యంగా తమ గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే,వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు గారు అన్నారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లుగా వ్యయ ప్రయాసలకోర్చి గ్రామాల అభివృద్ధికి,ప్రజా సేవకు సర్పంచ్ లు వారి కుటుంబసభ్యులు చేసిన కృషి,త్యాగాలు ప్రశంసనీయం అన్నారు.రాష్ట్రంలో పాలన మారినా ఒత్తిళ్లు వచ్చినా పార్టీని వీడకుండా పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై,తనపై నమ్మకంతో పార్టీకి అండగా ఉన్నందుకు ధన్యవాదాలు తెలిపారు.రానున్న గ్రామ పంచాయతీ



ఎన్నికల్లో తిరిగి వైసీపీ పాగా వేయడానికి ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా ప్రణాళికా బద్ధంగా వ్యవరించాలని చెప్పారు.పార్టీని బలోపేతం



చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారతి, రేష్మలకు సత్కారం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా ప్రమాణాలు మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో విశేష కృషి చేసినందుకు ఆనికాలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె. భారతి, ఉపాధ్యాయినీ షేక్ రేష్మలను మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, ఎంఈఓలు జె. ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యార్థుల్లో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను విద్యార్థులలో పెంపొందించడంలో ఉపాధ్యాయినీలు జె భారతి, షేక్ రేష్మ కృషి అభినందనీయమని తెలిపారు.

## కట్టకిందపాలెంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**అద్దంకి ఆర్.సి(పెన్ పవర్), ఏప్రిల్ 05**

భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలెంలో ఆదివారం ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు. ?ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో బాబుజీ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. రక్షణ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివని, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం కోసం బాబూ జగ్జీవన్ రామ్ కన్న కలలను సాకారం చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో ఐ.టీడీపీ అధ్యక్షులు కరిముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు అరిగెల. నాగరాజు, క్లస్టర్ ఇంచార్జి కాకాని అశోక్, స్థానిక టీడీపీ నాయకులు, అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రంను ప్రారంభించిన సిపిఐ నేత



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 5**

పట్టణ పరిధిలోని దివి వారి పాలెం వద్ద చేవూరి మాలకొండయ్య జ్ఞాపకార్థం ఆయన తనయుడు చేవూరి దుర్గా ప్రసాద్ ఏర్పాటు చేసిన చలివేంద్రంను సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఉధృతమవుతున్న సందర్భంలో బాటచారులకు దాహార్తించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా చేవూరు దుర్గాప్రసాద్ తన తండ్రి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎండల తీవ్రతకు ప్రజలు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వంతో పాటు అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ చలివెంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వై ఆనందమోహన్, సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు, సుభాను తదితరులు పాల్గొన్నారు.

## భైరవకోన ఆలయ పూజారి పై దాడి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోనలో ఆ పూజారిగా పనిచేస్తున్న రామమూర్తిపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసిన సంఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆలయ సమీప ప్రాంతంలో బైక్ పై వచ్చిన ఓ వ్యక్తి ఆకస్మికంగా రామమూర్తిపై దాడి చేసినట్లు సమాచారం దాడిలో రామమూర్తికి గాయాలు కావడంతో వెంటనే పామూరు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. దాడి వెనుక కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

## ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపిన ఎస్టీకాలనీవాసులు



**ఉలవపాడు, పెన్ పవర్, ఏప్రిల్ 05**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామఎస్టీకాలనీ వాసులు బాపట్ల యేసుమణి, బాపట్ల ప్రసన్నలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేవని, ఎన్నిసార్లు సచివాలయాల చుట్టూ తిరిగినా, రేషన్ కార్డులు రాలేదని, గతపాలకులకు ఎన్నిసార్లు ఈ విషయం చెప్పిన ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో నా సమస్య ఇప్పటికి తీరినదని అన్నారు. నా విషయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి దృష్టికి స్థానిక నాయకుల సహాయంతో తీసుకువెళ్లగానే, రేషన్ కార్డులు వచ్చేలా చేశారని ఎస్టీకాలనీ వాసులు అన్నారు. మొదటిసారి రేషన్ తీసుకొని ఎమ్మెల్యేకి ధన్యవాదాలు



తెలుపుకున్నారు. అదేవిధంగా కాలనీ ఇల్లు కూడా వచ్చేలా చూడమని, స్థానిక టిడిపి నాయకుల సహాయంతో ఎమ్మెల్యేకి తెలపాలని కోరారు. గతంలో వీరి ఇద్దరి పిల్లలకు కూడా ఎమ్మెల్యే వారి చేతుల మీదుగా ఆధార్ కార్డులను కూడా అందజేయడం జరిగినదని, కాలనీ ఇల్లు విషయం కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని స్థానిక టీడీపీ నాయకులు తెలియజేశారు. రేషన్ కార్డులు పొంది, రేషన్ తీసుకున్న అనంతరం ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులకు, కూటమి ప్రభుత్వానికి ఎస్టీకాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు.

## నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నారాయణస్వామికి పంచామృత అభిషేక పూజలు



నిర్వహించారు స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేసిన తదుపరి దేవస్థానం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం రాత్రి కి ఆలయ ఆవరణలో పల్లకి సేవ నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు వెంటనే ప్రారంభించాలి -సిపీఎం డిమాండ్



**లింగసముద్రం పెన్ పవర్ ఏప్రిల్ 5:**

రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు వెంటనే ప్రారంభించాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపీఎం ప్రతినిధి బృందం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. సిపీఎం ప్రతినిధి బృందం గుర్తించిన పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారానికి పూనుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ ను పొడిగించి, పోకూరు, మోపాడు, విశ్వనాథపురం చెరువు లకు నీరు అందించాలని వెంటనే కాలువ పొడిగింపు పనులు ప్రారంభించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీనివలన ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడాన్ని సిపీఎం నేతలు గుర్తించారు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని, నియమించాలని డిమాండ్ చేశారు. సోమశిల ప్రాజెక్టు నుంచి, 1.5 టిఎంసి నీరు రావడానికి అనుమతి ఉన్నప్పటికీ, నీరు విడుదల చేయడం లేదని, కాలువ సామర్థ్యం తక్కువగా ఉన్న శీదున నీరు రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారని , వెంటనే కాలువ వెడల్పు చేసి, నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లూరు ప్రాంతానికి, వచ్చే మంచి నీటి సరఫరా, సక్రమంగా రావడం లేదని, అనేక గ్రామాలలో పైపు లైన్లు పగిలి పోయి ప్రజలకు మంచి నీరు అందక నానా అవస్థలు పడుతున్నారని వెంటనే మరమత్తులు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొండారెడ్డి, సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి. వెంకటేశ్వర్లు, సిపిఎం గుడ్లూరు శాఖా కార్యదర్శులు కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, సీనియర్ నాయకులు దామా కృష్ణయ్య, కొప్పోలు నారాయణ డిమాండ్ చేశారు.

## బిజెపి జెండా దిమ్మె పనులను పరిశీలించిన కొండిశెట్టి వెంకట రమణయ్య




**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

బిజెపి పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షులు పి.వి.యన్ మాధవ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మన ఊరు -- మన జెండా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని శివాలయం వీధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న దిమ్మె పనులను ఆదివారం మన ఊరు మన జెండా జిల్లా కో-కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తోందని, అభివృద్ధి-సంక్షేమాలను సమన్వయంతో అమలు చేసే ఏకైక పార్టీ బిజెపినే అని అన్నారు. గ్రామాభివృద్ధి, జాతీయ గౌరవం, భారతీయ సాంస్కృతిక విలువలను ప్రపంచానికి తెలియజేసిన పార్టీ బిజెపి అని పేర్కొన్నారు. మన ఊరు మన జెండా" ద్వారా ప్రతి గ్రామంలో జాతీయతా భావం పెంపొందడమే తమ లక్ష్యమని తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజలతో కలిసి జరుపుకుంటూ, ప్రతి కార్యకర్త బృందంగా పని చేసి బిజెపిని మరింత బలపరచాలని వెంకటరమణయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు వెంకట సత్యం, మండల బిజెపి నాయకులు రెబ్బా రాయుడు, చౌడయ్య, నారాయణ స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నందీశ్వరా.. ఎంత కష్టం

### పునరుద్ధరణకు నోచని భారీ విగ్రహం

### రహదారి అంచున పడి ఉన్న నందీశ్వరుడు



**త్రిపురాంతకం, పెన్ పవర్ ఏప్రిల్ 5**

ప్రసిద్ధి గాంచిన త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ దక్షిణ మెట్లకు సమీపాన యర్రగొండపాలెం రహదారిలో మూలమలుపులో చెరువు కరకట్టను ఆనుకుని ఉన్న భారీ నందీశ్వరుని విగ్రహం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. అనేక మంది రాజులు త్రిపురాంతకేశ్వర స్వామిని కొలిచినప్పటి నుంచి ఆ విగ్రహం అక్కడే ఉంది. కానీ పాతికేళ్ల క్రితం గుప్త నిధుల కోసం దుండగలు తవ్వేయడంతో విగ్రహం ధ్వంసమైంది. ఎంతో చారిత్రక విలువైన ఆ విగ్రహాన్ని సరిచేసి తిరిగి పునరుద్ధరించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

**జంగమ దేవరులు ఏర్పాటుచేసింది**

అప్పట్లో సంగమ దేవరులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మండపంలో ప్రతిష్ఠించినట్లు చరిత్రకారులు పేర్కొంటారు. త్రిపురాంతకేశ్వరుని దర్శనం అనంతరం శ్రీశైలం వెళ్తూ భక్తులు బసవేశ్వరున్ని దర్శించుకునే వారని అప్పుడు అక్కడ ఉండే జంగమ దేవర శంఖం ఊది భక్తులకు విభూతి నామం పెట్టేవారని స్థానికులు వివరిస్తున్నారు.

**గుప్త నిధుల కోసం పగుల గొట్టారు..**

సుమారు 25 ఏళ్ల క్రితం దుండగులు గుప్త నిధుల కోసం విగ్రహాన్ని నిలువుగా పగులగొట్టి ధ్వంసం చేశారు. వజ్రాలు ఉంటాయనే ఉద్దేశంతో ఓ వైపు చెవిని సైతం విరగగొట్టారు. నాడు మండపంలో ఎంతో వైభవంగా పూజలందుకున్న నందీశ్వరుడు దుండగుల గునపాలకు బలై మట్టిలో కూరుకుపోయి దర్శనమివ్వడాన్ని చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పుడైనా పురావస్తు శాఖ అధికారులు విగ్రహాన్ని బాగుచేయించి పునఃప్రతిష్ఠించాలని కోరుతున్నారు.

# ఎమ్మెల్యేలూ... ఇక, ఫుల్ టైమ్ 'బిజినెస్'.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి.. 23 నెలలు అవుతున్నాయి. ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు, ఎంపీ లు ఏం చేశారంటే.. సొంత వ్యాపారాలు.. వ్యవహారాల్లోనే మునిగి తేలుతున్నారని.. సాక్షాత్తూ.. సీఎం చంద్ర బాబే తరచుగా చెబుతున్నారు. వారిని పనితీరు మార్చుకోవాలని కూడా ఆయన అంటున్నారు. ప్రజలకు చేరువ అవ్వాలని.. ప్రజల చుట్టూ తిరిగితేనే.. వచ్చే ఎన్నికల్లో టికెట్లు వస్తాయని కూడా తేల్చేస్తున్నారు. అయినప్పటికీ.. చాలా వరకునాయకులు ఏదో ముక్తసరిగా, కంటితుడుపుగానే వ్యవహరిస్తున్నారు. ఈ పరి ణామం ఇలా సాగుతుంటే.. ఇప్పుడు మరింతగా వారికి ఫ్రీడమ్ వచ్చింది. ఇప్పుడు నియోజకవర్గాల్లో తిరిగినా.. ప్రయోజనం లేదని ఒకరిద్దరు నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం. వచ్చే ఎన్నికల నాటికి.. నియోజకవర్గాల ముఖ చిత్రం పూర్తిగా మారనుంది. విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా కొత్త నియోజకవర్గాలు 50 కాకుండా.. ఏకంగా 88 పెరగనున్నాయి. అంటే.. ఇప్పుడున్న ఏ నియోజకవర్గమైనా.. అలానే ఉంటుందన్న గ్యారెంటీ లేదు. ఇక, మండలాల విభ జన కూడా జరగనుంది. దీనికితోడు.. మహిళా రిజర్వేషన్, వారికి కేటాయించే ప్రత్యేక నియోజకవర్గాలు వంటివి కూడా.. తెరమీదికి వచ్చాయి. అంటే.. ఒక రకంగా ఇప్పుడు ఉన్న ఏ అసెంబ్లీ, ఏ పార్లమెంటు నియోజకవర్గం కూడా వచ్చే ఎన్నికల నాటికి యథాతథంగా ఉండే అవకాశం లేదు. ఖచ్చితంగా మార్పు లు జరగనున్నాయి. జనరల్ నియోజకవర్గాల్లో ఎస్సీ స్థానాలు వచ్చినా ఆశ్చర్యం లేదు. లేదా మహిళలకు కేటాయించినా.. ఆశ్చర్యం లేదు. ఈ పరిణామం ఇప్పుడు సిట్టింగు ఎమ్మెల్యేలకు అందివచ్చిన వరంగా మారింది. వారు చక్కగా ఎంజాయ్ చేసేందుకు మంచి అవకాశం లభించింది. --ఇప్పుడే నియోజకవర్గంలో పర్యటించి ఏం చేస్తాం. వచ్చే ఎన్నికల నాటికి రాజెవరో..రెడ్డెవరో.. అసలు నియోజకవర్గం ఉంటుందో ఉండదో-- అనే టాక్ బలంగా వినిపిస్తోంది.ఫలితంగా.. వారు మరింత ఎక్కువగా తమ వ్యాపారాలు వ్యవహారాలు చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటి నుంచి నియోజకవర్గంలో తిరిగినా ప్రయోజనం లేదని భావిస్తున్న వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. తాము కష్టపడి ప్రజల మధ్యకువెళ్లినా.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారే అవకాశం ఉంటుందన్న చర్చ జోరుగా సాగుతోంది. సో.. మొత్తంగా పునర్విభజన నాయకులకు కలిసివచ్చేలా చేసింది.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తమిళ సమరంలో జనసేనాని ఎంట్రీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు ఎన్నికలు ఒక కీలక దశకు చేరుకున్నాయి. ఈ నెల 23వ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. దానికి నలభై ఎనిమిది గంటల ముందు అంటే 21న సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారానికి పరిసమాప్తం అవుతుంది. గట్టిగా చూస్తే పదిహేను రోజుల సమయం లేదు. ఇక దక్షిణాదిన పెద్ద రాష్ట్రం అయిన తమిళనాడుకు 234 సీట్లు ఉన్నాయి. భౌగోళికంగా పెద్ద ప్రాంతం కావడంతో పాటు అనేక ప్రాంతాలు పరిస్థితులు రాజకీయ స్వరూప స్వభావాలలో తేడా ఉంటుంది. అలాగే సామాజిక సమీకరణలు కూడా భిన్నంగా ఒక్కోచోట ఒక్కోలా ఉంటాయి.

**భీకరమైన పోరు :**

ఇక తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలలో భీకరమైన పోరు సాగనుంది. అధికార డీఎంకే బలంగా ఉంది. అనేక ఇతర పార్టీలను కలుపుకుని మరీ పటిష్టం అయింది. ఇక ప్రతిపక్ష అన్నా డీఎంకే సంగతి చూస్తే కనుక గ్రామీణ ప్రాంతాలలో మొదటి నుంచి బలం ఉంది. నాయకత్వంతో సంబంధం లేకుండా క్యాడర్ అటు డీఎంకేకు ఇటు అన్నా డీఎంకేకు మధ్య చీలిపోయారు. దాంతో ఈ రెండు పార్టీలకే చెరో నలభై ఓటు షేర్ కచ్చితంగా ఉన్న స్థితి కనిపిస్తోంది. ఈ మధ్యలో కొత్త పార్టీగా తమిళ దళపతి విజయ్ స్థాపించిన టీవీకే ఉంది. ఆ పార్టీకి విజయ్ సూపర్ స్టారిజమే ప్రధాన బలం. అంతే కాదు ఆయన చెబుతున్న ద్రవిడ వాదం మరో అనుకూల అంశం కానుంది. యువతతో పాటు జెడ్ జెన్ ఎక్కువగా విజయ్ పార్టీ వైపు ఉన్నారని అంచనాలు ఉన్నాయి.

**సీన్ లోకి పవన్ :**

ఇల త్రిముఖ పోరుగా ఉన్న తమిళనాడు సీమలోని ఎన్నికల సీన్ లోకి ఏపీ ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ఎన్డీయేలో ముఖ్య భాగస్వామిగా ఉన్నారు. దాంతో ఏపీ పొరుగున ఉన్న తమిళనాడులో పవన్ ద్వారా ప్రచారం చేయించి లాభపడాలని ఎన్డీయే జాతీయ స్థాయి పెద్దలు నిర్ణయించడంతో పవన్ ప్రచారానికి వెళ్తున్నారు. ఆయన ఏప్రిల్ 6న తమిళనాడులోని తెలుగు వారు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం చేస్తారు అని అంటున్నారు. ఆయన ప్రచారం నాగర్ కోయిల్ నియోజకవర్గంలో సాగుతుందని చెబుతున్నారు. బీజేపీ అభ్యర్థి ఎం ఆర్ గాంధీ తరఫున పవన్ ప్రచారం చేస్తారు. పవన్ కి సినీ క్రేజ్ తో పాటు పొలిటికల్ గా ఉన్న ఇమేజ్ తో బీజేపీకి ఎన్డీయేకి లబ్ది చేకూరుతుందని భావిస్తున్నారు. దాంతో పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో ఏ రకమైన సంచలనాలు నమోదు అవుతాయో చూడాల్సి ఉంది.

**మరో విడత సైతం :**

తమిళనాడులో పవన్ కళ్యాణ్ ప్రచారం లో తొలి విడతగా దీనిని చెబుతున్నారు. ఇంకా ఎన్నికల ప్రచారానికి మరి కొన్ని రోజులు ఉన్నందున మలి విడత ప్రచారానికి కూడా ఆయన రావచ్చు అని అంటున్నారు. బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న ప్రాంతాలలో పవన్ ప్రచారం చేస్తారు అని అంటున్నారు. అదే సమయంలో అన్నా డీఎంకే తో కూడిన కూటమి అభ్యర్థుల కోసం బహిరంగ సభలలో కూడా పాల్గొనే వీలు ఉందని అంటున్నారు. మొత్తానికి తమిళనాడు రాజకీయం అంటే సినీ గ్లామర్ విత్ పొలిటికల్ స్టైల్. పవన్ కళ్యాణ్ ఏపీలో ఈ రెండింటినీ మిక్స్ చేసి విజయం అందుకున్నారు. ఆయన గతంలో ఎక్కడ ప్రచారం చేసినా విజయాలే నమోదు అయ్యాయి దాంతో ఈసారి కూడా ఎన్ డీయేకు ఆయన భారీ లాభం చేకూరుస్తారా అన్న చర్చ సాగుతోంది అంతే కాదు ఆయన ఎన్నికల ప్రచారంలో ఏ అంశాలను ముందుకు తీసుకుని వస్తారు అన్నది కూడా ఇంకో చర్చగా ఉంది.

## బరువు తగ్గించే సూపర్ మెడిసిన్.. కానీ హెల్త్‌పై భారీ ప్రభావం ఉందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ రోజుల్లో బరువు తగ్గడం అనేది ఒక పెద్ద సవాలుగా మారింది. వ్యాయామం చేసే ఓపిక, డైటింగ్ చేసే టైం లేక చాలామంది షార్ట్ కట్స్ వెతుక్కుంటున్నారు. ఈ క్రమంలోనే 'మౌంజారో' వంటి ఇంజెక్షన్లు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. మూడు నెలల్లో 10 కిలోల బరువు తగ్గొచ్చన్న ప్రచారంతో యువత, ముఖ్యంగా పెళ్లికి సిద్ధమయ్యే వధువులు వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, అందం కోసం పడుతున్న ఈ ఆరాటం ప్రాణాల మీదకు తెస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ..

**షార్ట్ కట్ వెయిట్ లాస్.. అసలు నిజం ఏంటి?:**

మౌంజారో ఇంజెక్షన్ అనేది నిజానికి టైప్-2 డయాబెటిస్ ఉన్న రోగుల కోసం తయారు చేసిన మందు. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి వాడతారు. అయితే, ఇది ఆకలిని తగ్గించి బరువు తగ్గడానికి కూడా తోడ్పడుతుందని తెలియడంతో, ఇప్పుడు బరువు తగ్గాలనుకునే వారు దీనిని ఒక మ్యాజిక్ డ్రగ్‌లా వాడుతున్నారు. ఇక కేవలం ఫ్యాన్సీ దుస్తుల్లో సన్నగా కనిపించాలని, ఫోటోలకు స్లిమ్‌గా ఫోజులివ్వాలని డాక్టర్ల సలహా లేకుండానే వీటిని తీసుకుంటున్నారు. కానీ ఇది మ్యాజిక్ కాదు, శరీర సహజ ప్రక్రియలను మార్చే ఒక మెడికల్ డ్రగ్ అని గుర్తించాలి.

**ప్రాణాల మీదకు తెస్తున్న వెడ్డింగ్ ప్యాకేజీలు:**

ప్రస్తుతం కొన్ని క్లినిక్‌లు లాభాల కోసం 'వెడ్డింగ్ వెయిట్ లాస్ ప్యాకేజీల' పేరుతో ఈ ఇంజెక్షన్లను విచ్చలవిడిగా ప్రోత్సహిస్తున్నాయి. పెళ్లికి నెల రోజుల ముందు జిమ్‌కు వెళ్లే టైం లేని వారికి ఇదొక వరమని నమ్మిస్తున్నారు. ముంబైలో ఒక యువతి ఇలాగే ఇంజెక్షన్ తీసుకుని 10 కిలోలు తగ్గింది కానీ, ఆ తర్వాత తీవ్రమైన హార్మోన్ల అసమతుల్యత, విపరీతమైన నీరసంతో తన పెళ్లి ఆనందాన్ని కూడా కోల్పోయింది. డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఇలాంటి షార్ట్ కట్స్ తీసుకోవడం వల్ల శరీరం లోపల పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**ఆకర్షణీయమైన ప్రకటనలు.. చేదు నిజాలు:**

యూట్యూబర్లు తమ అనుభవాలను చెబుతూ ఈ ఇంజెక్షన్ల వల్ల అద్భుతాలు జరుగుతాయని ప్రచారం చేస్తున్నారు. అయితే, వారు కేవలం బరువు తగ్గడం గురించే చెబుతారు కానీ, ఆ తర్వాత వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ గురించి దాటవేస్తారు. ఇక ఈ మందులు ఆకలిని చంపేయడం వల్ల శరీరానికి అందాల్సిన పోషకాలు అందవు. ఫలితంగా జుట్టు రాలడం, చర్మం వాడిపోవడం, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇన్స్టంట్‌గా బరువు తగ్గడం అనేది చూడటానికి బాగున్నా, అది ఆరోగ్యానికి ఒక పెద్ద డిజాస్టర్ అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

**శాశ్వత మార్పు కావాలంటే సహజ మార్గమే మేలు:**


బరువు తగ్గడం అనేది ఒక క్రమశిక్షణతో కూడిన ప్రక్రియ. ఇంజెక్షన్లతో పది కిలోలు తగ్గడం అనేది తాత్కాలికమే. ఆ మందు వాడటం ఆపేయగానే మళ్లీ బరువు పెరగడమే కాకుండా, మెటబాలిజం కూడా దెబ్బతింటుంది. నిజంగా ఫిట్‌గా ఉండాలనుకుంటే పోషకాహారం, సరైన వ్యాయామం మాత్రమే సరైన మార్గాలు. కేవలం ఒక రోజు పెళ్లి వేడుకలో బాగుండాలని జీవితకాలం అనారోగ్యంతో బాధపడటం అవివేకం. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఇలాంటి మందులు వాడటం అంటే మన చేతులతో మనమే ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడమే.అందం కంటే ఆరోగ్యమే ముఖ్యం. ఇన్స్టంట్ బరువు కోసం షార్ట్ కట్స్ వెతికితే అవి షార్ట్ సర్క్యూట్‌లా మన జీవితాన్నే ఇబ్బందుల్లో పడేస్తాయి. కాబట్టి ప్రచారాలను నమ్మి మోసపోకుండా, సహజ పద్ధతుల్లో బరువు తగ్గడానికే ప్రాధాన్యత ఇవ్వండి. పది కిలోల వెయిట్ లాస్ కంటే, పది కాలాల పాటు ఆరోగ్యంగా ఉండటమే కదా అసలైన సక్సెస్!

## రాజీవా-రమేషా.. జోగి కుటుంబంలో టికెట్ పోరు.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నాయకుడు, ఫైర్ బ్రాండ్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్.. కుటుంబంలో రాజకీయ వివాదం ముసురుకుందా? టికెట్ కోసం తండ్రీ కొడుకులు.. వాదులాడుకుంటున్నారా? అంటే.. అవుననే అంటున్నారు వైసీపీ నాయకులు. ఇది కొంత చిత్రంగానే ఉన్నా.. వాస్తవమని తెలుస్తోంది. జోగి రమేష్ వచ్చే ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించారు. వాస్తవానికి ఆయన తనకు కలిసి వచ్చిన నియోజకవర్గంగా చెబుతున్నారు.గత 2019 ఎన్నికల్లో పెడన నుంచి పోటీ చేసిన జోగి.. విజయం దక్కించుకున్నారు. తర్వాత.. ఎన్నికల్లో ఆయన మైలవరం నుంచి పోటీ చేశారు. అయితే.. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ప్రస్తుతం వివిధ కేసుల్లో ఆయన చిక్కుకున్న విషయం తెలిసిందే. నకిలీ మద్యం నుంచి అగ్రిగోల్డ్ భూముల వరకు కూడా పలు కేసుల్లో ఆయన ఉన్నారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఆయన.. వచ్చే ఎన్నికలపై దృష్టి పెట్టారు.అయితే.. గత ఎన్నికల్లోనే తన కుమారుడిని బరిలోకి తీసుకురావాలని అనుకున్నప్పటికీ.. జగన్ అవకాశం ఇవ్వలేదు. దీంతో రమేష్ పోటీ చేశారు. కానీ, వచ్చే ఎన్నికల్లో కూడా ఇదే ఫార్ములా అవలంభిస్తామని ఇటీవల పార్టీ అధినేత చెప్పుకొచ్చారు. అయితే.. ఈ ఫార్ములా ఒక్క జోగికేనా.. మిగిలిన వారికి కూడానా అనేది తెలియాల్సి ఉంది. దీంతో వచ్చే ఎన్నికల్లో ఒక టికెట్టే లభిస్తే.. అది తనకేనని రాజీవ్ పట్టుబడుతున్నారని సమాచారం.అది కూడా మైలవరం అయితే.. తన గెలుపు పక్కా అని రాజీవ్ అంచనా వేసుకుంటున్నారు. కానీ, రమేష్ మాత్రం.. ఈ ఒక్కసారికి తనే పోటీ చేస్తానని.. రెండో టికెట్ ఇస్తే.. నువ్వు పోటీ చేయాలని కుమారుడికి తే ల్చి చెప్పినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ఇంట్లో పెద్ద రచ్చ సాగిందని పార్టీలో గుసగుస వినిపిస్తోంది. అయితే.. దీని వెనుక ఏదైనా వ్యూహం ఉందా? అనే అంశంకూడా చర్చకు దారి తీసింది. ఇంట్లో గొడవ పడితే.. అది వైసీపీ అధినేతకు చేరి.. తమ కుటుంబాన్ని ఓదార్చేందుకు.. సానుభూతి చూపించేందుకు రెండు టికెట్లు ఇచ్చినా ఇచ్చే అవకాశం ఉందన్న వ్యూహంతోనే జోగి ఆయన కుమారుడు ఈ విధమైన రగడకు తెరదీశారన్న చర్చ కూడా సాగుతోంది.

## కుమారుల చేతిలో తండ్రి హతం.. వివాహేతర సంబంధమే కారణం..



**హైదరాబాద్ పెన్ పవర్:** కుటుంబ గౌరవం మరియు నైతికత పేరుతో సొంత తండ్రి ప్రాణాలనే తీయడం అనేది అత్యంత విషాదకరమైన, దిగ్భ్రాంతికలిగించే విషయం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం, రేపాక గ్రామంలో జరిగిన ఈ ఘటన, క్షణికావేశం ఒక కుటుంబాన్ని ఎలా చిన్నాభిన్నం చేస్తుందో నిరూపిస్తోంది. తండ్రి ప్రవర్తనపై అసంతృప్తి ఉన్నప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని హత్యకు పాల్పడడం వల్ల ఇప్పుడు ఆ కుమారులు తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకున్నారు. ఈ దారుణ ఘటన, దాని వెనుక ఉన్న సామాజిక కోణాలపై విశ్లేషిస్తే..

**హైదరాబాద్ నుండి రేపాకకు..**

ఈ వివాదం కుటుంబ సభ్యుల మధ్య ఉన్న దూరం, మనస్పర్థల వల్ల మొదలైంది. మృతుడు చేరాలు రేపాక గ్రామంలో ఒంటరిగా నివసిస్తుండగా, అతని భార్య హైదరాబాద్‌లో కుమారుల వద్ద ఉంటోంది. తండ్రి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే విషయం కుమారులకు తెలిసింది. ఇది వారిలో ఆగ్రహాన్ని కలిగించింది. గ్రామానికి వచ్చిన కుమారులు, తన తండ్రి ఆ మహిళతో కలిసి ఉండడాన్ని గమనించి ఒక్కసారిగా దాడి చేశారు.

కుమారులు చేసిన దాడిలో చేరాలుతో పాటు ఆ మహిళ కూడా తీవ్రంగా గాయపడింది. తీవ్ర గాయాలైన వారిని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చేరాలు మరణించాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రేగొండ పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులైన కుమారుల కోసం గాలింపు చేపట్టారు.

ఇలాంటి ఘటనలు సమాజంలో పెరుగుతున్న అసహనాన్ని సూచిస్తున్నాయి. తండ్రి ప్రవర్తన తప్పు అనిపించినప్పుడు పెద్దల ద్వారా లేదా చట్టపరంగా పరిష్కరించుకోవాలే తప్ప, ప్రాణాలు తీయడం వల్ల పరిష్కారం కాదు.. అది పరిష్కారం కకపోగా.. అతి పెద్ద సమస్యకు దారితీస్తుంది. ఈ హత్య వల్ల తండ్రి ప్రాణాలు కోల్పోగా, కుమారులు జైలుకు వెళ్లారు. మళ్లీ తల్లి ఒంటరిగా మిగిలిపోయింది. ఇలాంటి ఘాతుకాల వల్ల ఆ కుటుంబంలోని మహిళలు (తల్లి, కోడళ్లు) పిల్లలు అనాథలుగా మారిపోతారు. గ్రామీణ ప్రాంతాల్లో 'పరువు' కోసం చేసే ఇలాంటి దాడులు మనుషుల మధ్య సంబంధాలను రక్తసిక్తం చేస్తున్నాయి.

**మారుతున్న సామాజిక విలువలు**

తండ్రి ప్రవర్తన సమాజంలో తమకు తలవంపులు తెస్తుందనే ఆవేదనతో కుమారులు ఈ దారుణానికి ఒడిగట్టారా లేక తల్లికి అన్యాయం జరుగుతుందని ఒడిగట్టారా? అయితే, ఒక తప్పును సరిదిద్దడానికి మరో పెద్ద తప్పు (హత్య) చేయడం వల్ల సమస్య పరిష్కారం కాలేదు సరికదా.. రెట్టింపు పెరిగింది. దీనివల్ల ఆ కుటుంబంలోని వారు వివక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. పరువు కోసం ప్రాణాలు తీయడం మనుషుల్లో పెరుగుతున్న అసహనానికి నిదర్శనం.

**నిందితుల పరిస్థితి!**

ప్రస్తుతం రేగొండ పోలీసులు హత్య కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులైన కుమారులు తండ్రిని చంపినట్లు రుజువైతే, వారికి జీవిత ఖైదు లేదంటే కఠిన కారాగార శిక్ష పడే అవకాశం ఉంది. ఒకవైపు తండ్రి మరణం, మరోవైపు కుమారులు జైలు పాలవ్వడం వల్ల ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికగా పూర్తిగా కుప్పకూలుతుంది.

ఆవేశం వచ్చినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం వల్ల కలిగే నష్టం ఎంత తీవ్రంగా ఉంటుందో నిరూపితమైంది. వివాహేతర సంబంధాలు కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మాట వాస్తవమే.., కానీ దానికి హత్యే పరిష్కారం కాదు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఈ ఘటన ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. కన్న తండ్రిని చంపిన కుమారులు ఇప్పుడు చట్టం ఎదుట నేరస్తులుగా నిలబడాల్సి ఉంటుంది. సమాజంలో వారి గౌరవం కూడా దెబ్బతింటుంది. తండ్రి తప్పుడు చేశాడా? లేదా? అన్న విషయాలు చాలా మందికి తెలియకపోవచ్చు.. కానీ వీరు ఒకరిని చంపి జైలుకు వెళ్లొచ్చారన్న విషయం మాత్రం అందరికీ తెలుస్తుంది. సమాజంలో నైతిక విలువలతో పాటు, సహనం, చట్టం పట్ల గౌరవం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆర్సీబీ ఆల్ రౌండ్ షో.. చెన్నైపై 43 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో భాగంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో జరిగిన పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 43 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (70), దేవదత్ పడిక్కల్ (50), రజత్ పాటిదార్(48), ఫిల్ సాల్ట్ ( 46), విరాట్ కోహ్లీ (28) అద్భుతమైన బ్యాటింగ్ చేయడంలో భారీ స్కోర్ చేసింది.

ఇక 251 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కేవలం 19. 4 ఓవర్లలోనే ఆలౌట్ అయింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సీఎస్కే జట్టు టాపార్డర్ మరోసారి ఘోరంగా విఫలమైంది. సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7) మొదటి ఓవర్లోనే జాకబ్ డఫీ పెవిలియన్ కి పంపించగా, అనంతరం క్రీజులోకి వచ్చిన ఆయూష్ మాత్రే(1)ని రెండో ఓవర్లో భువనేశ్వర్ కుమార్ ఔట్ చేశాడు. మూడో ఓవర్లో స్టార్ బ్యాటర్ సంజు శాంసన్ (9)ని డఫీ ఔట్ చేయడంతో డగౌట్ కి వెళ్లిపోయాడు. దీంతో 30 పరుగులకే కీలకమైన 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన లిసర్ఫరాజ్ ఖాన్ (50) మెరుపు హాఫ్ సెంచరీతో సీఎస్కే స్కోర్ బోర్డుని ముందుకు నడిపించేందుకు ప్రయత్నించాడు. కానీ కృనాల్ పాండ్యా బౌలింగ్ లో భారీ షాట్ ఆడబోయి స్టంప్ ఔట్ కాగా, ఆ తర్వాత ఓవర్లలోనే ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన కార్తిక్ శర్మ (6) ఏమాత్రం ప్రభావం చూపించకుండానే కృనాల్ బౌలింగ్ లోనే అభినందన్ సింగ్ కి క్యాచ్ ఇచ్చి మైదానం వీడాడు. దీంతో 84 పరుగులకే ఏకంగా 5 వికెట్లని నష్టపోయింది సీఎస్కే. ఇక తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే వచ్చి రావడంతోనే ఫస్ట్ బంతిని మైదానం స్టాండ్స్ లోకి కొట్టి మంచి ఊపు మీద కనిపించినప్పటికీ, కేవలం 18 పరుగులు చేసి అభినందన్ సింగ్ బౌలింగ్ లో జితేష్ శర్మకి క్యాచ్ ఇచ్చి క్రీజు వదిలి పెట్టి వెళ్లిపోయాడు దూబే. చివర్లో బ్యాటింగ్ కి వచ్చిన ప్రశాంంత్ వీర్, జేమీ ఓవర్టన్ మధ్య 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

చివర్లో ప్రశాంత్ వీర్ దూకుడైన బ్యాటింగ్ తో ఆర్సీబీ బౌలర్లపై విరుచుకు పడ్డాడు. హాఫ్ సెంచరీ దిశగా కొనసాగుతున్న అతడ్ని భువనేశ్వర్ కుమార్ ఔట్ చేశాడు. ఇక జేమీ ఓవర్టన్ సైతం 37 పరుగులు చేసిన తర్వాత సుయాష్ శర్మ బౌలింగ్ లో పెవిలియన్ కి వెళ్లిపోయాడు. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన నూర్ అహ్మద్ 8 పరుగులు చేసిన డగౌట్ కి వెళ్లిపోయాడు. లాస్ట్ ఓవర్లో అన్షల్ కాంబోజ్ బ్యాట్ ఝులిపించినప్పటికీ 207 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 3వికెట్లు తీసుకోగా, జాకబ్ డఫీ, కృనాల్ పాండ్యా, అభినందన్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, సుయాష్ శర్మ ఒకటి తీసుకున్నాడు.

# హైదరాబాద్ కోటలో లక్నో జయభేరి.. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన పంత్





**హైదరాబాద్ పెన్ పవర్:** సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఉప్పల్ స్టేడియంలో జరిగిన హోరాహోరీ పోరులో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. చివరి ఓవర్ వరకు అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో, కెప్టెన్ రిషబ్ పంత్ తనదైన శైలిలో బ్యాటింగ్‌తో జట్టును గెలిపించి, సొంత ప్రేక్షకుల మధ్య హైదరాబాద్‌ను ఓడించి లక్నోకు కీలకమైన విజయాన్ని అందించారు. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్, ఒక దశలో ఒత్తిడిలో పడినా కెప్టెన్ రిషబ్ పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు. మైదానం నలుమూలలా షాట్లతో విరుచుకుపడిన పంత్, ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చారు. మరోవైపు, మార్కరమ్ కూడా అద్భుతమైన పోరాట పటిమను కనబరిచారు.

**సొంత గడ్డపై హైదరాబాద్‌కు నిరాశ...**

సొంత ప్రేక్షకుల మద్దతు ఉన్నప్పటికీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో విజయాన్ని అందుకోలేకపోయింది. క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి తొలి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్నా, లక్నో బ్యాటర్లను కట్టడి చేయడంలో హైదరాబాద్ బౌలర్లు విఫలమయ్యారు. ఈ విజయంతో లక్నో పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచు



# 19వ ఓవర్.. అదంతా ధ్రువ్ జురెల్ ప్లాన్: రియాన్ పరాగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో కాస్త ఉత్కంఠభరితంగా సాగిన పోరుల్లో రాజస్థాన్ రాయల్స్-గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ ముందుంటుంది. 211 పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ 204/8 స్కోరు వద్దే ఆగిపోయింది. ఆఖరి రెండు ఓవర్లలో కేవలం 15 పరుగులు మాత్రమే చేయాల్సిన తరుణంలో గుజరాత్ తడబడటం గమనార్హం. ఇక ఆ రెండు ఓవర్లను వేసిన రాజస్థాన్ బౌలర్లపై ప్రశంసల వర్షం కురుస్తోంది. మరీ ముఖ్యంగా 19వ ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చాడు. అతడిని బౌలింగ్‌కు తీసుకురావడం వెనుక ధ్రువ్ జురెల్ ఉన్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ వెల్లడించాడు. అలాగే చివరి ఓవర్‌ను దేశ్‌పాండేకు ఇవ్వడం కూడా రాజస్థాన్ తీసుకున్న కఠిన నిర్ణయం. నాంద్రీ బర్గర్, సందీప్ శర్మకు అప్పటికి ఇంకా ఒక్కో ఓవర్ మిగిలే ఉన్నాయి. అయినా దేశ్‌పాండేకు బంతి ఇచ్చిన కెప్టెన్ ఫలితం అనుకూలంగా రాబట్టాడు. ఆర్ఆర్‌ను ఆరు పరుగుల తేడాతో దేశ్ పాండే గెలిపించాడు."ఈ మ్యాచ్‌లో నేను చాలా అవకాశాలను తీసుకున్నా. ఏదైతే అది జరుగుతుందనే ఉద్దేశంతో ముందడుగు వేశా. మా కుర్రాళ్లు అద్భుతం చేశారు. అరిచి అరిచి నా గొంతు కూడా బొంగురుపోయింది. మా బౌలర్లు ప్రణాళికలను పక్కాగా అమలు చేసి చూపించారు. ఓ దశలో విపరీతమైన టెన్షన్ వచ్చేసింది. 19, 20వ ఓవర్లు వేసేందుకు మా దగ్గర ఆప్షన్లు ఉన్నాయి. 19వ ఓవర్‌ను జోఫ్రా ఆర్చర్‌కు ఇచ్చాం. దీనికి ధ్రువ్ జురెల్ కారణం. కేవలం 12 బంతుల్లో 15 పరుగులు మాత్రమే గుజరాత్‌కు అవసరం. ధ్రువ్ చెప్పడంతో నేనూ ఓ ఛాన్స్ తీసుకున్నా. జోఫ్రా చేతికి బంతినిచ్చాం. దూకుడుగానే ఉండాలని నిర్ణయించుకున్నాం. ఆఖరికి మాకు సానుకూలంగా ఫలితం వచ్చింది. ఇప్పుడు కానీ, అనుకున్నట్లు రాకపోతే.. కచ్చితంగా కాసేపు బాధపడేవాడిని. అయితే, మళ్లీ వచ్చే మ్యాచ్‌లోనూ ఇలాగే ప్రయత్నించేవాడినే.ధ్రువ్ జురెల్ అద్భుతంగా ఆడాడు. అతడి టాలెంట్‌కు తగ్గట్టుగా న్యాయం జరగలేదేమో అనిపిస్తుంటుంది. సాధారణంగా ఆరు లేదా ఏడో స్థానంలో వచ్చే ధ్రువ్ (75) వన్‌డౌన్‌లో ఆడాడు. అతడికి మూడో స్థానంలో బ్యాటింగ్ ఇవ్వాలని తొలుత నేను చెప్పా. ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇలాగే కొనసాగితే కచ్చితంగా 700కిపైగా పరుగులు చేయగలడు. మేం విజేతగా నిలవడం పెద్ద కష్టం కాదు. వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచాం. సంబరాలు చేసుకుంటాం. మళ్లీ గువాహటి మ్యాచ్‌పై దృష్టిపెట్టి.. ముంబయిపై గెలిచేందుకు ప్రయత్నిస్తాం" అని రియాన్ పరాగ్ వెల్లడించాడు.

# తనకంటే ఐశ్వర్యారాయ్ గ్రేట్ అనేసిన అభిషేక్!







బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యరాయ్ వివాహ బంధం పై ఏదో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ఈనేపథ్యంలో తాజాగా ఓ మీట్ లో అభిషేక్ బచ్చన్ వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తమ ఇద్దరి మధ్య బంధం అనేది కేవలం భార్యాభర్తల సంబంధం మాత్రమే కాదని అదోక పరిపూర్ణమైన భాగస్వామ్యం అని అభిప్రాయపడ్డారు. -తన తల్లి జయా బచ్చన్ పెళ్లి సమయానికి తండ్రి అమితాబ్ కంటే పెద్ద స్టార్ అని గుర్తు చేసుకున్నారు. అందుకే ఇంట్లో పురుషుడే ఆధిపత్యం చలాయించాలనే ధోరణిలో తాను పెరగలేదని చెప్పారు. ఐశ్వర్యతో తన ప్రయాణం గురించి మాట్లాడుతూ, - కెరీర్ ప్రారంభం నుండే ఆమె తనకు మంచి స్నేహితురాలని, ఆ స్నేహమే తమ మధ్య గౌరవాన్ని, అవగాహనను పెంచిందన్నారు. ఇద్దరి మధ్య కెరీర్ పరంగా ఎప్పుడూ పోటీ లేదని అభిషేక్ వెల్లడించారు. తనకంటే ఐశ్వర్య ఎక్కువ సక్సెస్ సాధించినా తాను ఎప్పుడూ అసూయ పడలేదన్నారు. అది తమ మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అవగాహనకు నిదర్శనమన్నారు. ఒకరి గెలుపును మరొకరు సెలబ్రేట్ చేసుకోవడమే తమ బంధంలోని గొప్పతనమని వివరించారు. ఈ విషయంలో తమ మధ్య ఎప్పుడూ చర్చలు కూడా జరగవని అదంతా చాలా సహజంగా సాగిపోతుందన్నారు. అయినా నా కంటే ఐశ్వర్యా రాయ్ గొప్పదనే చెబుతానన్నారు. వైవాహిక జీవితంలో పనులు పంచుకోవడం గురించి కూడా అభిషేక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. -నేను ఆహారం తీసుకువస్తాను. నువ్వు ఇల్లు చూసుకో- అనే నిబంధనలు తమ మధ్య లేవన్నారు. ఏదైనా పనిని ఇద్దరం కలిసి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు సాగడమే తమ విజయ రహస్యంగా తెలిపారు. తన తండ్రి అమితాబ్ బచ్చన్ తనను లాంచ్ చేయలేదని, తన సొంత కష్టంతోనే ఈ స్థాయికి చేరానని, అదే ఆత్మవిశ్వాసం తన వ్యక్తిగత జీవితంలో కూడా ఉంటుందని పేర్కొన్నారు. దీంతో గత కొన్నాళ్లుగా వీరిద్దరూ విడిపోతున్నారంటూ వస్తోన్న పుకార్లకు అభిషేక్ మాటలు పరోక్షంగా చెక్ పెట్టినట్లు అయ్యింది. తమ వ్యక్తిగత జీవితాన్ని రహస్యంగా ఉంచడానికే ప్రాధాన్యత ఇస్తామని అవసరమైనప్పుడు మాత్రమే స్పందిస్తామని స్పష్టం చేశారు. ఐశ్వర్యరాయ్ - అభిషేక్ 2007లో వివాహం చేసుకోగా వీరికి ఆరాధ్య అనే కుమార్తె ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అభిషేక్ బచ్చన్ తన తదుపరి చిత్రం -కింగ్- షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో ఆయన షారుక్ ఖాన్‌తో కలిసి నటిస్తున్నారు. అలాగే కొత్త ప్రాజెక్ట్ లు కొన్ని లాక్ చేసారు. అయితే వాటి వివరాలు మాత్రం గోప్యంగా ఉంచారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com